మానేరు
# జనత ®
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

22.12.2025
సోమవారం Monday
సంపుటి (Volume): 10
సంచిక (Issue) : 243
పేజీలు : 8
Pages : 8
వెల : 2
Published from : Karimnagar

## లంకపై భారత్ ఘన విజయం



సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్




# గ్రామ పాలనను నిలబెట్టండి!

కొత్త సర్పంచ్‌లకు శుభాకాంక్షలు కాదు..

ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయాలు ఇవే

గ్రామ పాలనపై ప్రభుత్వానికి సూచనలు

- ఎడిటోరియల్

.. వివరాలు 7లో

రాష్ట్రవ్యాప్తంగా 12,700కు పైగా గ్రామ పంచాయతీలు. 1.4 కోట్లకు పైగా గ్రామీణ జనాభా. రాష్ట్ర అభివృద్ధికి పునాది గ్రామ పాలనే.ఈ నేపథ్యంలో నేడు కొత్తగా ఎన్నికైన గ్రామ సర్పంచ్‌లు పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులుఅందరూ వారికి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. కానీ నిజం ఏమిటంటే.. శుభాకాంక్షలతో గ్రామాలు మారవు. నిర్ణయాలతోనే మారతాయి. ఈ రోజు పదవీ స్వీకారం చేస్తున్న సర్పంచ్‌ల ముందు ఉన్నది పండుగ కాదు. పాలన పరీక్ష. ఆ పరీక్షను ఎదుర్కొనే బాధ్యత సర్పంచ్‌లదే కాదు.. ప్రభుత్వానిదే.

## కృష్ణా, గోదావరి జలాలపై సభలో
# చర్చకు సిద్ధమా?

### సభకు వస్తే గౌరవంగా చూసుకునే బాధ్యత నాది..



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సీఎం రేవంత్ సవాల్

కృష్ణా జలాల్లో 36% చాలని సంతకం చేసింది కేసీఆరే

అందుకు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

ఏపీలోని పట్టిసీమ ప్రాజెక్టును పొగిడింది కేసీఆరే

ఆయన సభలు పెట్టిన చోటల్లా ఆ వీడియోలు ప్రదర్శిస్తాం

ఉమ్మడి ఏపీలో కంటే కేసీఆర్ పాలనలో ఎక్కువ అన్యాయం

కరడుగట్టిన నేరస్థుడైనా మారతాడు.. కేసీఆర్ మాత్రం జంకు లేకుండా రంకు మాటలు మాట్లాడుతున్నారు

కేసీఆర్, కేటీఆర్‌లు ఆర్థిక ఉగ్రవాదులు

కూలేశ్వరం లేకున్నా తెలంగాణలో రికార్డు స్థాయిలో వరి

మీడియాతో ఇష్టాగోష్ఠిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

జనతా న్యూస్, హైదరాబాద్ : 'కృష్ణా జలాల విషయంలో ఉమ్మడి రాష్ట్రంలో కంటే కేసీఆర్ పదేళ్ల పాలనలోనే తెలంగాణకు ఎక్కువ అన్యాయం జరిగింది. కృష్ణా జలాల్లో ఏపీకి 511 టీఎంసీలు (64 శాతం), తెలంగాణకు 299 టీఎంసీలు (36 శాతం) చాలు అని సంతకం పెట్టింది కేసీఆరే. ఆ సంతకంతో మహబూబ్‌నగర్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాలకు మరణ శాసనం రాసిందీ ఆయనే. ఆ పాపానికి ప్రజలకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలి. ఉమ్మడి రాష్ట్రం కంటే కేసీఆర్ సీఎంగా ఉన్న పదేళ్లలోనే తెలంగాణకు నీటి విషయంలో ఎక్కువ నష్టం జరిగింది. కాంగ్రెస్

మిగతా 2 లో



## మీ పాలనలోనే అన్యాయం

ఉమ్మడి రాష్ట్రంలో కంటే రెండు రెట్లు మేర జలదోపిడీ జరిగింది: మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి




## ఇప్పటివరకు ఓ లెక్క..
# రేపటి నుంచి మరో లెక్క

"ఇప్పటివరకు ఓ లెక్క.. రేపటి నుంచి మరో లెక్క. నేనే వస్తున్నా.. తోలు తీస్తా. ప్రజలతో కలిసి కాంగ్రెస్ భరతం పడతా" అని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంతసేపూ రియల్ ఎస్టేట్ దందా తప్ప.. ప్రజా సంక్షేమం పట్టడంలేదన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతల సంయుక్త సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

### వస్తున్నా.. తోలు తీస్తా!

రెండేళ్లు మౌనంగా ఉన్నా.. తప్పదు కాబట్టే బయటకు వచ్చా

ప్రభుత్వానికి రియల్ ఎస్టేట్ దందా తప్ప.. ఏవీ పట్టడంలేదు

రాష్ట్రానికి వచ్చే నీళ్లను కూడా కాపాడలేని దద్దమ్మ ప్రభుత్వం

చంద్రబాబు కుట్రతోనే పాలమూరు ప్రాజెక్టు డీపీఆర్ వెనక్కి

దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మౌనం వహిస్తోంది?

బీజేపీ మొదటి నుంచీ తెలంగాణకు శనిలా వ్యవహరిస్తోంది

కాంగ్రెస్, టీడీపీ పాలమూరుకు ద్రోహం చేశాయి

సర్వభ్రష్ట కాంగ్రెస్ సర్కారుపై పోరాటం చేస్తాం

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆగ్రహం

3





## 'వీబీ- జీ రామ్ జీ' పథకం
# రాష్ట్రపతి ఆమోదం..

ఉపాధికి మరింత గ్యారంటీ..పని దినాల పెంపు

ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పథకం

వీబీ- జీ రామ్ జీ పథకంపై వివరణ ఇచ్చిన కేంద్రం



'వీబీ- జీ రామ్ జీ' రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదివారం ఆమోదముద్ర వేయటంతో చట్టంగా మారింది. కేంద్రం ఈ పథకం అసలు ఉద్దేశాన్ని చంపేసిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తుండగా, ఆధునిక గ్రామీణ అవసరాలకు తగినట్లుగా పథకంలో మార్పులు చేశామని మోదీ సర్కారు చెబుతోంది.

4

# హిందూ సమాజ రక్షణే ఆరెస్సెస్ ధ్యేయం



బీజేపీ కళ్లద్దాలతో సంఘ్‌ను చూడొద్దు

అది చాలా తప్పు ఆరెస్సెస్‌కు రాజకీయ అజెండా లేదు

ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ స్పష్టీకరణ

4



# ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ఎస్ఐఆర్ అవసరం

మొదటి పేజీ తరువాయి

అధికారులతో ఆయన సమావేశమయ్యారు. మూడో విడత ఎస్ఐఆర్ ఎప్పుడు చేపట్టేది ఆయన స్పష్టంగా వెల్లడించకపోయినప్పటికీ మరో మూడు నెలల తర్వాత మొదలయ్యే అవకాశం ఉందని రాష్ట్ర ఎన్నికల సంఘం వర్గాలు తెలిపాయి. సమావేశంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ మాట్లాడుతూ బిహార్‌లో నిర్వహించిన భారీ ఎస్ఐఆర్ ప్రక్రియ ఎలాంటి లోపాలు లేకుండా పూర్తయిందన్నారు. ఆ రాష్ట్రంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సుమారు 7.5 కోట్ల మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారని చెప్పారు. ఈ మొత్తం ప్రక్రియలో ఒక్క ఫిర్యాదు కూడా రాలేదని, రీపోలింగ్, రీకౌంటింగ్ అవసరం లేకపోవడం విశేషమన్నారు. తెలంగాణలో ఒక బీఎల్‌వో పరిధిలో 930 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఎస్ఐఆర్ సమయంలో ఓటర్ల జాబితాల్లోని చనిపోయినవారి పేర్లు, డబుల్ ఓట్లు వంటి లోపాలు బయటపడతాయన్నారు. వాటిని సరిచేయడానికి ఎస్ఐఆర్ అవసరమని వివరించారు. భారత రాజ్యాంగానికి అతిపెద్ద సైనికులు బీఎల్‌వోలేనని.. ప్రస్తుతం 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ కొనసాగుతోందని, భవిష్యత్తులో మిగతా రాష్ట్రాల్లో కూడా చేపడతామని తెలిపారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్‌ను అందరం కలిసి విజయవంతం చేద్దామని బీఎల్‌వోలకు పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్‌తో ఓటర్ల జాబితా ప్రక్షాళన పూర్తయిన తర్వాత రాష్ట్రంలో ఎన్నికల యంత్రాంగం కొత్త శకంలోకి అడుగుపెడుతుందని చెప్పారు. భారత ఎన్నికల వ్యవస్థకు బీఎల్‌వోలే వెన్నెముక అని, వారి నిబద్ధత, కృషిపైనే ఓటర్ల జాబితా ప్రక్షాళనలో విజయం ఆధారపడి ఉంటుందన్నారు. కెనడా దేశం కంటే రాష్ట్రంలోనే ఎక్కువ మంది ఓటర్లు ఉన్నారని, ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత బీఎల్‌వోలపైనే ఉందని తెలిపారు.

**పట్టణ ఓటర్లలో నిరాసక్తి**

దేశవ్యాప్తంగా ఎక్కడ ఎన్నికలు జరిగిన గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక శాతం ఓటింగ్ జరుగుతుంటే.. పట్టణాల్లో మాత్రం తక్కువగా ఉంటోందని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. పట్టణ ప్రాంతాల్లోని వారికి ఓటు వేయడంపై ఉన్న నిరాసక్తే దీనికి ప్రధాన కారణమని చెప్పారు. దీన్ని అధిగమించేందుకు ఎన్నికల విభాగాలు మరింత చైతన్యం తీసుకురావాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల ఓటర్లు మాత్రం ఉత్సాహంగా క్యూలో నిలబడి ఓటు హక్కు వినియోగించుకుంటూ దేశానికి దారి చూపుతున్నారని కొనియాడారు. దేశంలో ఎన్నికలను చట్టబద్ధంగా పక్కాగా నిర్వహిస్తున్నామని, ఎన్నికల చట్టాలను ప్రతిఒక్కరూ పాటించాల్సిందేనని సీఈసీ స్పష్టంచేశారు. భారత ప్రజాస్వామ్య విస్తృతిని ప్రస్తావిస్తూ దేశంలో 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాల్లో కలిపి 90 కోట్లకు పైగా ఓటర్లు ఉన్నారన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సీ సుదర్శన్ రెడ్డి, అదనపు సీఈవో వాసం వెంకటేశ్వరరెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, సీనియర్ డిప్యూటీ సీఈసీ పవన్ కుమార్‌శర్మ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గాదె ఇన్నయ్య అరెస్ట్

**జఫర్‌గడ్ ఆశ్రమంలో అదుపులోకి తీసుకున్న ఎన్ఐఏ..**

**మావోయిస్టులకు అనుకూలంగా మాట్లాడారని నోటీసులు**

**ఉపా చట్టం కింద కేసు.. నాంపల్లి కోర్టులో హాజరు..14 రోజుల రిమాండ్**



**జఫర్‌గడ్, డిసెంబరు 21 :** జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం రేగడితండా పరిధిలోని మా ఇల్లు ప్రజాదరణ ఆశ్రమ నిర్వాహకుడు, మాజీ మావోయిస్టు నాయకుడు గాదె ఇన్నయ్యను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) పోలీసులు అరెస్ట్ చేశారు. సెప్టెంబరులో ఛత్తీసగఢ్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన భూపాలపల్లి జిల్లాకు చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు కట్టా రామచంద్రారెడ్డి అంత్యక్రియల్లో ఇన్నారెడ్డి పాల్గొన్నారు. అక్కడ ఓ ఛానల్‌తో మాట్లాడిన ఆయన.. మావోయిస్టులకు, వారి ఉద్యమానికి అనుకూలంగా వ్యాఖ్యలు చేశారని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని పోలీసులు ఉపా చట్టం కింద కేసు నమోదు చేశారు. రామచంద్రారెడ్డి అంత్యక్రియలతో పాటు సంస్మరణ సభలో పాల్గొనడం, నిషేధిత తీవ్రవాద సంస్థకు మద్దతు, వారి ఉద్యమాన్ని ప్రోత్సహించేలా మాట్లాడటం, విప్లవాన్ని ప్రేరేపించేలా వ్యవహరిస్తున్నారని నోటీసుల్లో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ఇన్నయ్య ఆశ్రమానికి వచ్చిన పోలీసులు ఆయా అంశాలకు సంబంధించి సుమారు గంటకు పైగా ఆయనను ప్రశ్నించినట్లు సమాచారం. ఇన్నయ్య నుంచి రెండు సెల్‌ఫోన్లు, సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఆయనను హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో హాజరు పరచగా, న్యాయస్థానం 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. కాగా, జఫర్‌గడ్ మండలం సాగరంనకు చెందిన ఇన్నయ్య గతంలో కొన్నేళ్ల పాటు మావోయిస్టు ఉద్యమ నేతగా పని చేశారు. జన జీవనంలోకి వచ్చాక ఇన్నయ్య-పుష్పారాణి దంపతులు 2006లో సాగరం క్రాస్ వద్ద మా ఇల్లు ప్రజాదరణ పేరుతో ఆశ్రమం స్థాపించారు. సుమారు రెండు దశాబ్దాలుగా అనాథలు, నిరుపేద పిల్లలను ఆశ్రమంలో చేర్చుకుని వారి ఉన్నతికి కృషి చేస్తున్నారు.

**అరెస్టకు దారి తీసిన వ్యాఖ్యలు..**

కట్టా రామచంద్రారెడ్డి అలియాస్ వికల్ప్ అంత్యక్రియల సందర్భంగా.. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా, లొంగిపోయిన ఇద్దరు మావోయిస్టు నేతలపై గాదె ఇన్నయ్య చేసిన వ్యాఖ్యల వీడియో క్లిప్పింగ్‌లు మరోసారి తెరపైకి వచ్చాయి. "మోదీ, అమిత్‌షా.. మీరు ఏం సాధిద్దామని రామచంద్రారెడ్డిని అతి కిరాతంగా చంపేశారు..? పిరికి పందల్లా చంపడం గొప్ప అనుకుంటున్నారా..? మీ కాళ్ల దగ్గర తుపాకులను పెట్టిన వాళ్ల నుంచి సమాచారం తీసుకుని రామచంద్రారెడ్డిని చంపేశారు. మోదీ, షా.. మీకు దమ్ము, సిగ్గు, శరం ఉంటే ఛత్తీసగడ్‌లో ఐదో షెడ్యూల్‌ను అమలు చేయండి. పాలకులకు విప్లవ ద్రోహులు బ్రాండ్ అంబాసిడర్లుగా మారారు" అంటూ ఇన్నయ్య చేసిన వ్యాఖ్యలు ఆయన అరెస్టుకు దారి తీశాయని తెలుస్తోంది.



# కృష్ణా, గోదావరి జలాలపై సభలో చర్చకు సిద్ధమా?

మొదటి పేజీ తరువాయి

హయాంలో ప్రారంభమైన భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, కల్వకుర్తి, పాలమూరు-రంగారెడ్డి, డిండి, ఎస్-ఎల్‌బీసీ, సీతారామసాగర్, కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకం... ఇలా కృష్ణా నదిపై ఉన్న ఒక్క ప్రాజెక్టును కూడా పదేళ్లలో పూర్తిచేయలేకపోయారు. అసలు కృష్ణా, గోదావరి జలాల విషయంలో ఇప్పటివరకు ఎప్పుడేం జరిగింది? ఎవరేం చేశారు? అని చర్చించేందుకు జనవరి రెండో తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు పెడతాం. కేసీఆర్ రావాలి. చర్చలో పాల్గొనాలి. ఒకరోజు కృష్ణా జలాల మీద, మరో రోజు గోదావరి జలాలపై చర్చిద్దాం. ఒక్కో అంశంపై రెండేసి రోజులు చర్చకు సిద్ధమన్నా సరే' అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. తెలంగాణకు ద్రోహం చేసిందే కేసీఆర్ అని... అసెంబ్లీకి వస్తే ఆ ద్రోహిని నిలదీస్తామని అన్నారు. సభలో ఆయన గౌరవానికి భంగం కలగకుండా చూసుకునే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. కేసీఆర్ క్రియాశీల రాజకీయాల్లో లేరని, సభకు వచ్చి చర్చిస్తేనే ఉన్నట్లని వ్యాఖ్యానించారు. రోడ్డు మీద కాదు... అసెంబ్లీలో నీళ్లు-నిజాలపై చర్చిద్దామని సూచించారు. 'కేసీఆర్ సభకు రాకుంటే ఆయన చెంచాలతో చ ర్చించాలా? వారికేం తెలుసు' అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం తన నివాసంలో విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

కేసీఆర్ మారాడేమో అనుకున్నా...

అసెంబ్లీ ఎన్నికలు అయిన రెండేళ్ల తర్వాత, పార్లమెంటులో గుండుసున్నా అయ్యాక, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓడిపోయాక, పంచాయతీ ఎన్నికల్లో పత్తా లేకుండా పోయాక అయినా కేసీఆర్ బయటికొచ్చారు.. సంతోషం. ప్రజల తీర్పుల తర్వాత అయినా ఆయన మారారేమో అనుకున్నా. కానీ రెట్టించిన ఉత్సాహంతో అబద్ధాలు చెప్పారు. కేసీఆర్‌కు తెలంగాణ ప్రజల జ్ఞాపకశక్తి మీద నమ్మకం లేదేమో కానీ.. నాకు ఉంది. అందుకే కేసీఆర్ చేసిన పాపాలు, ఘోరాలకు ప్రజలు ఎప్పటికప్పుడు ఎన్నికల్లో తీర్పులు ఇస్తూనే ఉన్నారు. కరడుగట్టిన నేరగాడు అయినా కొంత మారతాడు. కానీ, కేసీఆర్ మాత్రం జంకులేకుండా రంకు మాటలు మాట్లాడుతూనే ఉన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 36 శాతం వాటా చాలని శాశ్వతంగా రాసిచ్చేసిందే కేసీఆర్. ఇది దాచిపెట్టి ప్రజలను తప్పుదారి పట్టించే మాటలు మాట్లాడుతున్నారు. మేం వచ్చాకే కృష్ణా జలాల్లో సగం వాటా కావాలని కొట్లాడుతున్నాం.

**ఏపీ జలదోపిడీకి దోహదం చేసిందే కేసీఆర్**

కర్ణాటక నుంచి కృష్ణా నీళ్లు తెలంగాణలోకి ప్రవేశించగానే జూరాల నుంచే ఆ నీటిని ఒడిసిపట్టాలి. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జూరాల నుంచి నీటిని తీసుకోవాలి. కానీ కేసీఆర్ నీరంతా రాయలసీమకు వెళ్లాక అక్కడి నుంచి తెలంగాణకు తీసుకునేలా ఒప్పుకున్నారు. మూతి దగ్గర నుంచి తీసుకోవాల్సింది తోక దగ్గర పెట్టారు. పైపులు, కాంట్రాక్టుల్లో కమీషన్ల కోసం తెలంగాణ ప్రయోజనాలను అమ్మేశారు. పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి, మల్యాల, రాయలసీమ ఎత్తిపోతల పథకాలను పొగిడిందే కేసీఆర్. ఏపీ జలదోపిడీకి దోహదం చేసిందే ఆయన. పదేళ్లలో రూ.2 లక్షల కోట్లు సాగునీటి రంగంపై ఖర్చు చేశామన్నారు. ఇందులో రూ.1.80 లక్షల కోట్ల బిల్లులు ఇచ్చామన్నారు. కానీ, కృష్ణా నదిపై ఉన్న భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, కల్వకుర్తి, పాలమూరు-రంగారెడ్డి, డిండి, ఎస్ఎల్‌బీసీ, సీతారామసాగర్, కొడంగల్-నారాయణపేట ప్రాజెక్టుల్లో ఒక్కటైనా పూర్తిచేశారా? ప్రాజెక్టుల డబ్బులొచ్చే న ల్లా నీ ఇంట్లో ఇప్పుకున్నారు నగదంతా నీ ఇంటికి వచ్చింది. సంగెంబండ ప్రాజెక్టుకు అడ్డంగా ఉన్న బండను పగలగొట్టేందుకు కూడా డబ్బులివ్వలేదు. మేం వచ్చాక నిధులిచ్చాం. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకునాడు తాము 90 టీఎంసీల నీళ్లు అడిగితే.. ఇప్పుడు 45 టీఎంసీలకే ఒప్పుకున్నారని కేసీఆర్ ఆరోపించారు. ఆయన అసలు నికరజలాలు అడగ నే లేదు. కృష్ణా నది నికర జలాల్లో 36 శాతానికి ఒప్పుకోకుండా వాటా పెంచుకుని... అందులోనే ఆ నీటిని అడిగి ఉండొచ్చు కదా! కానీ, 45 టీఎంసీలు మైనర్ ఇరిగేషన్ కింద (నికర జలాలు) అడిగారు. మరో 45 టీఎంసీలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి నుంచి కృష్ణా నదికి పట్టిసీమ ద్వారా నీటిని తరలించినందుకు.. అందులో కూడా వాటాగా అని చూపించారు. దీనిపై పంచాయితీ ఉంది. దీన్ని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి ఆధ్వర్యంలో తెలంగాణ, ఏపీ సీఎంలు సభ్యులుగా ఉండే అపెక్స్ కౌన్సిల్‌లో పరిష్కరించుకోవాలి. కానీ, కేసీఆర్ దీనిపై ట్రైబ్యునల్‌లో కేసువేశారు. దీంతో అది వివాదంలో ఉంది. ఆ కేసు తేలాక కదా ఆ 45 టీఎంసీల నీటి వ్యవహారం తేలేది? అది తేలకుండా ఈ డీపీఆర్ ఏంటి? మెదడుందా? అంటూ కేసీఆర్ మొహంమీద కేంద్ర సంస్థలు ఆ డీపీఆర్‌ను తిప్పికొట్టాయి. కేసీఆర్ ఆ కేసుల పరిష్కారం కోసం పదేళ్లపాటు చేసిందేమీ లేదు. మేం ఫాంహౌంసలో పండుకోకుండా ఢిల్లీలో ఆ కేసుల సంగతి తేల్చేందుకు ప్రయత్నిస్తున్నాం. వరి పంట చేతికొచ్చే సమయంలో వడగళ్ల వానలా కేసీఆర్ ప్రసంగం ఉంది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కట్టొద్దని కేసు వేసిన హర్షవర్ధన్‌రెడ్డికే కేసీఆర్ అసెంబ్లీ టికెట్ ఇచ్చారు. ఇది నిజం కాదా?

**తండ్రీ, కొడుకులు ఆర్థిక ఉగ్రవాదులు**

ఆర్థిక వ్యవస్థపై కేసీఆర్ అత్యాచారం చేశారు. కేసీఆర్, కేటీఆర్‌లు ఆర్థిక ఉగ్రవాదులు. గుల్లచేసి నడిబజార్లో నిలబెట్టేశారు. భూకంపం వచ్చాక మిగిలిన శిథిలాల పరిస్థితిలా తెలంగాణ ఆర్థిక వ్యవస్థను చేసేశారు. మేం ఇవన్నీ ఒక్కోటి చక్కపెడుతున్నాం. రూ.26 వేల కోట్ల రుణాలను రీస్ట్రక్చర్ చేశాం. సంసారం చేసేవాడు ఎవరైనా 12 శాతం వడ్డీకి అప్పు తెస్తారా?.. కేసీఆర్ తెచ్చారు. మేం దాన్ని 7.1 శాతానికి తగ్గించాం. అప్పుల చెల్లింపు కాలాన్ని 15 ఏళ్ల నుంచి 35 ఏళ్లకు పెంచాం. దీంతో ఏటా రూ.4 వేల కోట్లు ఆదా అవుతుంది. మరో రూ.86 వేల కోట్ల రుణాలను కూడా రీస్ట్రక్చరింగ్ చేయాలని కేంద్రాన్ని అడుగుతున్నాం. కేసీఆర్ తెచ్చిన అప్పులను తీర్చేందుకే కొత్త అప్పులు చేయాల్సి వస్తోంది.

**కొడుకేమో కుర్చీ.. అల్లుడేమో చావు కోరుతున్నారు**

నేను కేసీఆర్ చావును కోరుకుంటున్నానని అంటున్నారు. కానీ, ఆయన కాలు విరిగితే పరామర్శించి, మంచి వైద్యం అందించాలని కోరింది నేనే. ఆయన ఆరోగ్యంగా ఉండాలని.. అసెంబ్లీలో చర్చలకు రావాలని కోరుకుంటున్నాం. కానీ కొడుకేమో ఆయన కుర్చీ కోరుకుంటున్నాడు. హరీశ్‌రావు ఆయన చావు కోరుకుంటున్నాడు. కేసీఆర్ ఉన్నంతవరకు నేను ఆయన బాటలోనే అని ఇటీవల హరీశ్‌రావు అన్నారు. ఎవరికైనా దానర్థం ఏంటో తెలుసు. కేసీఆర్ పోతే కేటీఆర్‌ను ఒక్క తన్ను తన్ని పార్టీని హరీశ్ లాక్కోవాలని చూస్తున్నారు. ఆయన ఇతర పార్టీల్లోకి వెళ్లరు. ఎందుకంటే బీఆర్ఎస్ పార్టీ బ్యాంకు నిల్వ రూ.1,500 కోట్లు, పార్టీ ఆస్తులు రూ.3,500 కోట్లు ఉన్నాయి. కనిపించని వజ్ర వైఢూర్యాల సంగతి తెలీదు. కేసీఆర్ తర్వాత పార్టీని లాక్కుంటే ఆ ఆస్తి అంతా ఆయనదే. కేసీఆర్‌కు ఆ పార్టీ ఎమ్మెల్యేలతో కానీ, బయటివారితో కానీ ఎలాంటి ప్రమాదం లేదు. ప్రమాదమంతా కుటుంబంతోనే. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడే... తానే సీఎం అయిపోతున్నా అని కేటీఆర్ కొత్త బట్టలు కుట్టించుకున్నాడు. కానీ.. కేసీఆర్ ఆ పదవి ఇవ్వడని నేనప్పుడే చెప్పా. ఇప్పుడు కేటీఆర్ ఐరన్ లెగ్. ఒక్క ఎన్నికల్లోనూ గెలవలేదు. హరీశ్‌రావును పార్టీ అధ్యక్షుడిని చేయాలి అన్నవాదన పార్టీలో ప్రబలింది. అందుకే కేసీఆర్ మళ్లీ బయటికి వచ్చారు. ఆయన వ్యాఖ్యలపై మొరిగేందుకే నేను మీడియాతో ఇష్టాగోష్ఠి పెట్టానని అన్నారు. ఆయన వాడింది ఏం భాష? ఆయన వయసుకు తగిందేనా? ఆయన తమలపాకుతో కొడితే నేను తలుపు చెక్కతో దంచుతా. కానీ, అల్లుడు, కొడుకు ఆయన్ని చావు అంచులకు తెస్తున్నారని సానుభూతితోనే నేను ఉన్నా.

**మా పాలనలోనే అధిక వినియోగం**

గత 11 ఏళ్లలో తెలంగాణ అత్యధికంగా కృష్ణా జలాలను వాడుకున్నది మా ప్రభుత్వం వచ్చాకే. 299 టీఎంసీలకే కేసీఆర్ ఒప్పుకున్నా... కనీసం ఆ నీళ్లను కూడా ఏ ఒక్క ఏడాదీ వాడుకోలేదు. మేం వచ్చాక అత్యధికంగా ఈ ఏడాది 286 టీఎంసీల నీటిని వాడుకున్నాం. అంతేకాదు.. మా హయాంలోనే వరిపంటలో సాగులో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. కూలేశ్వరం (కాళేశ్వరం ఎత్తిపోతల పథకం) లేకున్నా నెంబర్‌వన్‌గా నిలిచాం.

**కేసీఆర్ సభలు పెట్టే చోట..ఈ వీడియో ప్రదర్శిస్తాం**

ఏపీలోని ప్రాజెక్టులను సమర్థిస్తూ కేసీఆర్ మాట్లాడిన వీడియోలను సీఎం రేవంత్‌రెడ్డి తన ఫోన్‌లో చూపించారు. 'తెలంగాణ భూభాగం అత్యంత ఎత్తులో ఉంది. ఏపీలో సమతలంగా ఉంది. నదీ నీటిని ఎత్తిపోయడమంటే భారీ ఖర్చు. ఇచ్ఛాపురం నుంచి శ్రీకాళహస్తి వరకు బరాజ్‌లు కట్టుకోవాలని చంద్రబాబుకు చెప్పాను. దుమ్ముగూడెం దాటాక ఇక మేం ఒక్కచుక్క నీటిని తీసుకోలేం. ఏం వాడుకున్నా ఏపీ సోదరులే వాడుకోవాలి. కాబట్టి నాయుడుపేట - కాళహస్తి వరకు నీళ్లు తీసుకెళ్లాలని చంద్రబాబుకు చెప్పా. నేను చెప్పాకే చంద్రబాబు ఆ ప్రాజెక్టు మీద వ్యాప్కోసకు ప్రతిపాదన సిద్ధం చేయాలని ఇచ్చారు. ఏపీలో చంద్రబాబు పట్టిసీమ కట్టారు. అది అభినందనీయం. మంచిదే. చేసుకోమని చెప్పా. కృష్ణా, గోదావరి నీటి వాడకంలో చిల్లర పంచాయితీలు వద్దు. రెండు ప్రాంతాలు గౌరవంగా వాడుకోవాలి' అని కేసీఆర్ గతంలో చేసిన వ్యాఖ్యల వీడియోలను రేవంత్‌రెడ్డి చూపించారు. చంద్రబాబునాయుడి పేట శ్రీకాళహస్తి... ఎర్రంనాయుడి పేట ఇచ్ఛాపురం వరకు నీటిని తీసుకెళ్లమని సలహా ఇచ్చిందే కేసీఆర్ అని ఆరోపించారు. 'పట్టిసీమ కడితే పొగిడిందే కేసీఆర్. రాయలసీమకు నీటిని తీసుకెళ్లాలని చెప్పిందే కేసీఆర్. పోతిరెడ్డిపాడు నుంచి 10 టీఎంసీల కృష్ణా నీటిని తీసుకెళ్లాలన్నదే కేసీఆర్. రెండు టీఎంసీల పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలను ఒక్క టీఎంసీకి కుదించిందీ ఆయనే. కేసీఆర్ పెడతానన్న బహిరంగసభల వద్ద అసెంబ్లీలో అతను మాట్లాడిన ఇదే వీడియోను ప్రదర్శిస్తాం' అని తెలిపారు.

**కేసీఆర్ చంద్రబాబు శిష్యుడే...**

చంద్రబాబునాయుడి శిష్యుడే కేసీఆర్. ఆయనకు మంత్రి పదవి ఇచ్చింది ఎన్టీఆర్ కాదు.. చంద్రబాబే. అందుకే సీఎం కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు చంద్రబాబుకు గోదావరి నీటిని వాడుకోవాలని చెప్పా అన్నట్లున్నారు. కృష్ణా నీటిని గోదావరితో అనుసంధానం చేసినందుకు మెచ్చుకున్నారు అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు.

**తండ్రీ కొడుకుల మధ్యే ఏకాభిప్రాయం లేదు**

పంచాయతీ ఎన్నికల్లో 87 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మేం ముందున్నా. 6 స్థానాల్లో బీఆర్ఎస్, ఒక్క స్థానంలో బీజేపీ ముందున్నాయి. నేను చెప్పింది తప్పయితే పంచాయతీ ఎన్నికల్లో విజయాలపై నిజనిర్ధారణ కమిటీ వేద్దాం.. సిద్ధమా? ఫ్యూచర్ సిటీపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు వింటే.. పదేళ్లు సీఎంగా చేసిన వ్యక్తేనా అలా మాట్లాడింది అనిపించింది. చర్లపల్లి, నాచారం పారిశ్రామిక వాడలను ఫ్యూచర్ సిటీకి తరలించాలని కేసీఆర్ అన్నారు. మేం అదే పని చేయడానికి హిల్ట్ పాలసీ తెస్తే కేటీఆర్ తప్పంటున్నారు. తండ్రీ కొడుకుల మధ్యనే ఏకాభిప్రాయం లేదు.

# మీ పాలనలోనే అన్యాయం

**ఉమ్మడి రాష్ట్రంలో కంటే రెండు రెట్లు మేర జలదోపిడీ జరిగింది: మంత్రి ఉత్తమ్**



**హైదరాబాద్, డిసెంబరు 21 :** నీటిపారుదల ప్రాజెక్టులపై ఉద్యమాలు చేయడం కాదు... ముందు చేసిన తప్పులకు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. కేసీఆర్ అవినీతి, కక్కుర్తికి నీటిపారుదల శాఖ సర్వనాశనం అయ్యిందని ఆరోపించారు. బచావత్ ట్రైబ్యునల్ ఉమ్మడి ఏపీకి కేటాయించిన 811 టీఎంసీల కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు చాలని, ఏపీకి 512 టీఎంసీలు ఇవ్వాలని అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఒప్పుకున్నారా లేదా? చెప్పాలని కేసీఆర్‌ను ప్రశ్నించారు. ఆదివారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో 90 శాతం పనులు పూర్తయ్యాయా...? ఆ ప్రాజెక్టు కోసం రూ.27 వేల కోట్లు ఖర్చుపెట్టి.. రూ.50 వేల కోట్లకు అంచనాలను మీరే సవరించారు. ఏ విధంగా 90 శాతం పూర్తయినట్లు? మేము అధికారంలోకి వ చ్చాక రూ.7 వేల కోట్లు ఈ ప్రాజెక్టు కోసం వెచ్చించాం. ఈ ప్రాజెక్టు డీపీఆర్‌ను బీఆర్ఎస్ అధికారంలో ఉండగానే 2023లోనే కేంద్రం వెనక్కి పంపింది. అప్పట్లో సీఎంగా, నీటిపారుదలశాఖ మంత్రిగా ఎవరున్నారు? ఈ ఎత్తిపోతల పథకానికి 90 టీఎంసీలకు తగ్గకుండా నీరివ్వాలని ట్రైబ్యునల్‌ను అడుగుతున్నాం. మీలాగా మోసం చేసే అలవాటు లేదు' అని మండిపడ్డారు. కృష్ణా జలాల్లో 299 టీఎంసీలు తెలంగాణకు సరిపోతాయని మీరు రాసిస్తే, 500 టీఎంసీలకంటే ఎక్కువ ఇవ్వాలని ట్రైబ్యునల్ లో తాము కొట్లాడుతున్నామని చెప్పారు. నాటి ఏపీ సీఎం వైఎస్ జగన్‌తో కుమ్మక్కై రాయలసీమ ఎత్తిపోతల పథకానికి పరోక్షంగా సహాయం చేసి, తెలంగాణకు ద్రోహం చేశారని ఆరోపించారు. 2004-14 మధ్య శ్రీశైలం నుంచి ఏపీ 727 టీఎంసీల నీటిని అక్రమంగా తరలించుకుపోతే.. 2014-23 మధ్య 1,442 టీఎంసీలు తరలించుకుపోయిందని తెలిపారు. కృష్ణా ప్రాజెక్టుల విషయంలో కేసీఆర్ 90% అబద్ధాలే మాట్లాడారని మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తికాకపోవడానికి కేసీఆర్ నిర్ణయాలే కారణమని ఆరోపించారు. ఆయన నోరు జారితే అంతకంటే ఎక్కువ నోరు తాము కూడా జారుతామని హెచ్చరించారు. నీటిపారుదల విభాగంలో కేసీఆర్ పాలించిన పదేళ్లలోనే నిర్లక్ష్యం జరిగిందని, కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో కాదని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం రూ.1.81 లక్షల కోట్లు ఖర్చుపెట్టి.. రైతాంగానికి, ప్రజలకు చేసిన ప్రయోజనం శూన్యమని విమర్శించారు. కాళేశ్వరంలో రూ.లక్ష కోట్లు పెడితే... కొత్త ఆయకట్టు లక్ష ఎకరాలు కూడా రాలేదని మండిపడ్డారు. రాజీవ్ దుమ్ముగూడెం, ఇందిరాసాగర్ ప్రాజెక్టుల పనులకు రూ.1,550 కోట్లు వెచ్చిస్తే.. 4 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు వచ్చేదని అన్నారు. ఆ ప్రాజెక్టుల స్థానంలో సీతారామ ఎత్తిపోతల పథకం చేపట్టి... రూ.18 వేల కోట్లు ఖర్చుపెట్టారని ఆరోపించారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా పెండింగ్ ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయలేదో మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలకు.. ఎస్ఎల్‌బీసీ, డిండి ఎందుకు పూర్తి చేయలేదో నల్లగొండ జిల్లా ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మీడియా ముందుకు వచ్చేటప్పుడు మంచిగా ప్రిపేర్ అవ్వాలని కేసీఆర్‌కు ఉత్తమ్ చురకలంటించారు. రాష్ట్రంలో అత్యధికంగా వరి పంట సాగైంది కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకనేనని తెలిపారు.

# ఇప్పటివరకు ఓ లెక్క.. రేపటి నుంచి మరో లెక్క

**రెండేళ్లు మౌనంగా ఉన్నా.. తప్పదు కాబట్టే బయటకు వచ్చా**
**ప్రభుత్వానికి రియల్ ఎస్టేట్ దందా తప్ప.. ఏవీ పట్టడంలేదు**
**రాష్ట్రానికి వచ్చే నీళ్లను కూడా కాపాడలేని దద్దమ్మ ప్రభుత్వం**
**చంద్రబాబు కుట్రతోనే పాలమూరు ప్రాజెక్టు డీపీఆర్ వెనక్కి**
**దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మౌనం వహిస్తోంది?**
**బీజేపీ మొదటి నుంచీ తెలంగాణకు శనిలా వ్యవహరిస్తోంది**
**కాంగ్రెస్, టీడీపీ పాలమూరుకు ద్రోహం చేశాయి**
**సర్వభ్రష్ట కాంగ్రెస్ సర్కారుపై పోరాటం చేస్తాం**
**బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆగ్రహం**



**హైదరాబాద్, డిసెంబరు 21 :** "ఇప్పటివరకు ఓ లెక్క. రేపటి నుంచి మరో లెక్క. నేనే వస్తున్నా.. తోలు తీస్తా. ప్రజలతో కలిసి కాంగ్రెస్ భరతం పడతా" అని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంతసేపూ రియల్ ఎస్టేట్ దందా తప్ప.. ప్రజా సంక్షేమం పట్టడంలేదన్నారు. అన్ని రంగాలను కుదేలు చేస్తున్న సర్వభ్రష్ట కాంగ్రెస్ సర్కారుపై పోరాటం చేస్తామని ప్రకటించారు. వారికి ఇన్నిరోజులు అవకాశం ఇచ్చామని, ప్రజలకేదో మంచి చేస్తారని ఇంత కాలం మౌనంగా ఉన్నానని, తప్పదు కాబట్టే బయటకు వచ్చానని తెలిపారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతల సంయుక్త సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రానికి వచ్చే నీళ్లను కూడా కాపాడలేని దద్దమ్మ ప్రభుత్వమన్నారు. కేవలం 40 టీఎంసీలు చాలునంటూ కేంద్రానికి ఎలా లేఖ రాస్తారని ప్రశ్నించారు. తెలంగాణకు బచావత్ ట్రైబ్యునల్ 90 టీఎంసీల నీటి కేటాయింపులు చేసిందని తెలిపారు. అదనంగా వచ్చేవాటితో కలిపి 165 టీఎంసీల వరకు తీసుకెళ్లవచ్చని, దాంతో పాలమూరులో ఆరున్నర లక్షల ఎకరాలతోపాటు మరో కొంత కలిపి మొత్తం 13 లక్షల ఎకరాలకు నీరు వస్తుందని భావించామని చెప్పారు. తద్వారా పాలమూరు జిల్లాకు ఉపశమనం లభిస్తుందని అనుకున్నామన్నారు. కానీ, కేంద్రం కొత్తగా తాఖీదు ఇచ్చిందని, అందుకు కాంగ్రెస్ ఎందుకు తల ఊపుతోందని మండిపడ్డారు. 45 టీఎంసీలు ఇవ్వమని ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ ఎలా లేఖ రాస్తారని ప్రశ్నించారు. సర్కారుకు సంబంధించి ప్రతి విషయంలోనూ చెక్ చేస్తామన్నారు. అనేక అంశాలపై పోరాడుతున్నామని, భూ దందాలపై కొట్లాడుతున్నామని తెలిపారు.

**ఇక మౌనంగా ఉండేది లేదు..**

గోదావరి జలాల దోపిడీ జరుగుతుంటే.. ఎవరి ప్రయోజనాల కోసం చప్పుడు చేయకుండా ఉన్నారని కేసీఆర్ ప్రశ్నించారు. ఇక నుంచి తానే స్వయంగా రంగంలోకి దిగుతానన్నారు. రెండు మూడు రోజుల్లో పెద్ద ఎత్తున సమావేశాలు నిర్వహిస్తామని, ప్రతి ఊరిలో డప్పు కొడతామని, జలదోపిడీపై ఎండగడతామని ప్రకటించారు. తెలంగాణ ప్రయోజనాల కోసం ఎవరితోనైనా కొట్లాడతామన్నారు. రాష్ట్ర హక్కులను రక్షించుకోవాలని, ఈ విషయంలో తాను మౌనంగా ఉండేదిలేదన్నారు. పాలమూరుపై కేంద్రం తీరును నిలదీస్తామన్నారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో, 20ఏళ్ల టీడీపీ పాలనలో పాలమూరు జిల్లాను కోలుకోలేని దెబ్బకొట్టారని ఆరోపించారు. భీమా ప్రాజెక్టు, తుంగభద్ర ఎడమకాల్వ ద్వారా 174 టీఎంసీల నీరు పాలమూరు జిల్లాకు రావాల్సి ఉందన్నారు. నిజానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటే.. తెలంగాణకు పెనుశాపంగా మారిందని, అందులో ఉమ్మడి పాలమూరు జిల్లా చాలా నిరాదరణకు గురైందని తెలిపారు. సమైక్య రాష్ట్రంలో నీళ్లు అడగలేదని, అయినా.. జూరాలను అక్కడే కట్టాలని 70 టీఎంసీల నీటి ని ట్రైబ్యునల్ స్వయంగా కేటాయించిందని పేర్కొన్నారు. ఇదంతా 1974-76 మధ్య జరిగిందని, అప్పటి సీఎం అంజయ్య పునాదిరాయి వేస్తే.. పట్టించుకున్నవారే లేరని అన్నారు.

**గులాబీ జెండా ఎగిరాకే..**

"బ్యారేజీ కట్టారు కానీ, కాల్వలు లేవు.. నీళ్లు పారవు. 2001లో గులాబీ జెండా ఎగిరే వరకు ఇదే పరిస్థితి ఉండేది. పాలమూరు జిల్లాను అప్పటి సీఎం చంద్రబాబు దత్తత తీసుకుని ఇష్టం వచ్చినట్లు పునాదిరాళ్లు వేసుకుంటూ పోయారే తప్ప.. నిర్మాణాలు చేసిందే లేదు. కర్ణాటక రాష్ట్రానికి రూ.13 కోట్ల పరిహారం ఇవ్వకపోవడంతో అప్పట్లో బాబును ప్రశ్నించాను. తీవ్రమైన విమర్శ లు చేస్తే.. కర్ణాటకకు పరిహారం చెల్లించి, జూరాల కట్టించాడు. అయితే 80 వేల ఎకరాలకు పారాల్సిన జూరాల 20 వేల ఎకరాలకు పడిపోయింది. తెలంగాణ వచ్చా క.. పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చాం. నెట్టెంపాడు, భీమా, కల్వకుర్తిని లైన్‌లోకి తెచ్చి 6.50 లక్షల ఎకరాల ఆయకట్టును అందుబాటులోకి తెచ్చాం. మిషన్ కాకతీయలో ప్రాధాన్యమిచ్చి మైనర్ ఇరిగేషన్ సామర్థ్యాలు పెంచాం. వాగులపై చెక్ డ్యామ్‌లు కట్టాం. వీటి ద్వారా మరో 1.50 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చింది. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేస్తూనే.. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని తెరమీద కు తెచ్చాం. అన్ని అనుమతులు సాధించి ప్రక్రియ మొదలు పెట్టేలోపు ప్రభుత్వం మారింది" అని కేసీఆర్ అన్నారు.

**రెండేళ్లలో తట్టెడు మట్టి తీయలేదు..**

రెండేళ్లుగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు తట్టెడు మట్టి తీయడం లేదని, పైసా పనిచేయడం లేదని కేసీఆర్ విమర్శించారు. దీని వెనుక ఎవరి ఒత్తిడి దాగి ఉందని ప్రశ్నించారు. చంద్రబాబు కుట్ర కారణంగానే పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్రం వెనక్కు పంపిందని ఆరోపించారు. బీజేపీ మొదటి నుంచీ తెలంగాణకు శని అయిందని, కేంద్ర ప్రభుత్వానికి ఎంపీలు అవసరం కాబట్టి చంద్రబాబు మాటలు విని డీపీఆర్‌ను వాపస్ పంపింద న్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు లొల్లి చేయడంలేదని ప్రశ్నించారు. "కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ప్రజల మధ్య ఎండగడతాం. పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో గ్రామగ్రామాన పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతాం. పోస్టర్ తయారు చేస్తున్నాం. రెండు మూడు రోజుల్లో విడుదల చేస్తాం. భారీ బహిరంగ సభలు నిర్వహించి, నేనే స్వయంగా హాజరవుతా" అని కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సర్వభ్రష్ట ప్రభుత్వమని విమర్శించారు. తమ హయాంలో మంచి పద్ధతిలో ప్రభుత్వాన్ని నడిపించామని, ప్రస్తుతం రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువయ్యాయని, పట్టపగలే హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. నేరాల తీవ్రత 20 శాతం పెరిగిందన్నారు. రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ 420 హామీలిచ్చిందని, అలవికాని హామీలిచ్చి..ప్రజలను రెచ్చగొట్టి మోసం చేశారని ఆయన ఆరోపించారు.

**ఫార్మాసిటీని అమ్మేసే ప్రయత్నం..**

ఐడీపీఎల్‌ను నెహ్రూ హయాంలో పెట్టారని, దాని పుణ్యాన కొందరు సొంతంగా ఫార్మా పెట్టి విస్తరించారని కేసీఆర్ తెలిపారు. ఆ తర్వాత విస్తరించి హైదరాబాద్ ఫార్మా హబ్‌గా మారిందన్నారు. అయితే వాటి నుంచి వచ్చే రసాయనాలు, వ్యర్థాలతో అంతా కలుషితం చేస్తాయని ముచ్చర్లలో ఫార్మాసిటీ, యూనివర్సిటీ ఏర్పాటుకు సంకల్పించామని చెప్పారు. అందుకోసం 20 వేల ఎకరాల అవసరం కాగా.. 14 వేల ఎకరాలను సేకరించామ ని, కేంద్రం పర్యావరణ అనుమతులు సైతం మంజూరు చేసిందని అన్నారు. కానీ, ఇప్పుడు దాన్ని అమ్మేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఫ్యూచర్ సిటీ ఎవరికి కావాలి? వైబ్రెంట్ సిటీ నువ్వు చేసేదేంటి? అంటూ సీఎం రేవంత్‌రెడ్డినుద్దేశించి వ్యాఖ్యానించారు. అందరూ తలో చేయి వేస్తేనే హైదరాబాద్ ఇంత పెద్దసిటీ అయిందన్నారు. ఫార్మాసిటీ కోసం తీసుకున్న భూములను దాని ఏర్పాటు కోసమే వాడతామనే కండిషన్ ఉందని, హైకోర్టుకు కూడా ప్రభుత్వం అదే చెప్పిందని తెలిపారు. కానీ, అక్కడ అంబానీ కోసం 3వేల ఎకరాలు ఇస్తామంటున్నారని, ఇదెక్కడి దందా? అని ప్రశ్నించారు. ఈ రాష్ట్రాన్ని ఏం చేయదలుచుకున్నారని నిలదీశారు. కాంగ్రెస్ పాలసీలన్నీ గందరగోళంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వాలు బిజినెస్ మీట్లు పెట్టడం, ఎంవోయూ చేసుకోవడం సహజమని, కానీ.. హైప్ క్రియేట్ చేశారని తప్పుబట్టారు.

**కేసీఆర్ చచ్చిపోవాని తిడుతున్నరు..**

రాష్ట్ర ప్రభుత్వాన్ని నడిపించడం చేతగాక, తనను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని, వాళ్ల నోటికి మొక్కాలని కేసీఆర్ అన్నారు. "కేసీఆర్ చచ్చిపోతే బాగుండునని తిడుతున్నారు. స్కూలు పిల్లల వద్దకు వెళ్లినా, యూనివర్సిటీకి వెళ్లినా, ఎక్కడ మీటింగ్ పెట్టినా.. నన్ను తిట్టడానికే ప్రాధాన్యమిస్తున్నారు. దుర్మార్గపు మాటలు మాట్లాడుతున్నారు" అని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. తాను రంగంలోకి దిగానని, రేపటి నుంచి ప్రజాక్షేత్రంలో అందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ గంగలో కలిసిపోయిందని, రాష్ట్రంలో భూముల ధరలు పడిపోయాయన్నారు. గతంలో డాంబర్ రోడ్డుకు ఆనుకొని రాష్ట్రంలో ఏ మూలన ఉన్నా ఎకరం రూ.50 లక్షలు పలికిందని, నాలుగెకరాలున్న రైతులు కోటీశ్వరులమని సంతోషపడ్డారని పేర్కొన్నారు. కానీ, ఇప్పుడు భూముల ధరలు పాతాళానికి పడిపోయాయని, ఒక్క ఎకరం కూడా అమ్ముడుపోయే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ పాలకులు ప్రజలను వంచించి అందరినీ ఏడిపిస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీలు కట్టడానికే ఇబ్బంది పడాల్సి వస్తోందంటూ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. రూ.2.90 లక్షల కోట్లు మాత్రమే గత ప్రభుత్వం అప్పులు చేసినట్లు కాగ్ చెప్పింది కదా? అని గుర్తు చేశారు. ఏది ఏమైనా పాలమూరు- రంగారెడ్డి విషయంలో రాజీ పడబోమని, ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వాన్ని నిద్రపోనీయమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ ప్రజల కోసమని అన్నారు.

**ఎంవోయూలకు ఆద్యుడు చంద్రబాబే**

ఎంవోయూలకు ఆద్యుడు చంద్రబాబునాయుడని కేసీఆర్ అన్నారు. చంద్రబాబు లెక్కల ప్రకారం ఏపీకి రూ.20 లక్షల కోట్లు రావాలని, తొలుత వైజాగ్‌లో ఇటువంటి సమ్మిట్‌లు పెటి.. ఎంవోయూ చేసుకున్నారని తెలిపారు. చివరికి ఆ ఎంవోయూలు చేసుకున్నవారు వైజాగ్‌లో వంటమనుషులని అన్నారు. ఏపీ ఎంవోయూల్లో ఆఖరికి 10 వేల కోట్లు కూడా రాలేదని పేర్కొన్నారు. తాను సీఎంగా ఉన్న సమయంలో మధ్యప్రదేశ్‌కు వెళ్తే అక్కడ ప్రధాని మోదీ చేసుకున్న 14 లక్షల కోట్ల ఎంవోయూలు అన్నీ బోగస్ అని ఆ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రే తనతో స్వయంగా చెప్పారని తెలిపారు. బోగస్ ఎంవోయూలతో ప్రజల్ని ఎందుకు మోసం చేస్తున్నారని ప్రశ్నించారు. తమ హయాంలో బిజినెస్ మీట్‌లు, కాంక్లేవ్‌లు పెట్టలేదన్నారు. మంచి పాలసీలు తీసుకువస్తే.. పారిశ్రామికవేత్తలు వారే స్వయంగా వస్తారని ఆయన అన్నారు.

# పార్టీ గుర్తుతో ఎన్నికలొస్తే గెలుపు మనదే!

**పంచాయతీ ఎన్నికల్లో జనం మనవైపే**
**కాంగ్రెస పార్టీకి గ్రామీణ ప్రజలు తగిన బుద్ధి చెప్పారు**
**బీఆర్ఎసఎల్పీ, పార్టీ రాష్ట్ర కార్యవర్గ భేటీలో కేసీఆర్ వ్యాఖ్య**
**సభ్యత్వాల నమోదు, పార్టీ కమిటీలపై చర్చ**



గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ వైపే నిలిచారని, ఎన్నికల ఫలితాలు పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల్లోనే ఫలితాలు ఇలా ఉంటే.. పార్టీ గుర్తుతో జరిగే ఎన్నికల్లో బీఆర్ఎసకు తిరుగు లేదంటూ.. పార్టీ శ్రేణుల్లో ఆయన జోష్ పెంచారు. గర్వంతో ఎగిరే కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు గ్రామీణ ప్రజలు తగిన బుద్ధి చెప్పారని, రెండేళ్లలో కాంగ్రెస్ సర్కార్ ఒక కొత్త పాలసీ కూడా తీసుకురాలేదని.. ఉన్న పథకాలు ఆపేసిందని విమర్శించారు. చాలాకాలం తర్వాత కేసీఆర్ ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎసఎల్పీ, పార్టీ కార్యవర్గ సభ్యులతో సమావేశమయ్యారు. పార్టీ భవిష్యత్ కార్యక్రమాలు, పంచాయతీ ఎన్నికల ఫలితాలు, సభ్యత్వాల నమోదు, కమిటీల ఏర్పాటు, సాగునీటి ప్రాజెక్టుల అంశాలతోపాటు తాజా రాజకీయ పరిణామాలు, రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై సమీక్ష జరిపినట్లు సమాచారం. ఈ సందర్భంగా కేసీఆర్ మాటాడుతూ.. బీఆర్ఎస్ మద్దతుదారులకు ప్రజలు ఓట్లేసి గెలిపించి కాంగ్రెస్ సర్కార్‌పై ఉన్న వ్యతిరేకత బయటపడిందని అన్నట్లు తెలిసింది. రానున్న మునిసిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభంజనం సృష్టించనుందని ధీమా వ్యక్తం చేశారు. 2026 మొత్తం ఎన్నికల సంవత్సరంగా ఉండబోతోందని, పార్టీ శ్రేణులన్నీ ఇప్పటినుంచే సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రతిపక్షాలతో ఎలా వ్యవహరించాలో కాంగ్రెస్ తమకు నేర్పిస్తోందని, భవిష్యత్తులో తాము కూడా అదేవిధంగా వ్యవహరిస్తామని ఆయన వ్యాఖ్యానించినట్లు సమాచారం. త్వరలోనే పార్టీ సభ్యత్వ నమోదు, ఆ వెంటనే అన్నిస్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు పార్టీ కార్యవర్గ సమావేశంలో కేసీఆర్ ప్రకటించినట్లు తెలిసింది. ఎన్‌డీఏ కూటమిలో కీలకంగా మారిన ఏపీ సీఎం చంద్రబాబు అన్ని విధాలా కేంద్ర ప్రభుత్వాన్ని వాడుకుంటున్నారని.. తెలంగాణకు నష్టం కలిగించేలా కుట్రలకు పాల్పడుతున్నారని సమావేశంలో కేసీఆర్ ఆరోపించినట్లు సమాచారం. కాగా, ఉప్పల్ నియోజకవర్గంలోని పలువురు ఎంబీబీఎస్ విద్యార్థుల విద్యాభ్యాసానికి అయ్యే ఖర్చును ఎమ్మెల్యే భండారి లక్ష్మారెడ్డి భరిస్తున్నారు. ఈ మేరకు మాజీ సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఆదివారం ఆ విద్యార్థులకు చెక్కులను అందజేశారు.



# సమ్మక్క-సారలమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ

**జనవరి 28 నుంచి 31 వరకు ఉత్సవం నిర్వహణ**

**హైదరాబాద్, ములుగు, డిసెంబరు 21 :** ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో జరిగే వనదేవతల మహాజాతర పోస్టర్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ఆదివారం ఈ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి సీతక్క, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌లతో కలిసి ఈ పోస్టర్‌ను సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 28-31 వరకు మేడారంలో సమ్మక్క-సారలమ్మ మహాజాతర జరగనుందన్నారు. జనవరి 28(బుధవారం) సాయంత్రం 6 గంటలకు సారలమ్మ కన్నెపల్లి నుంచి మేడారం గద్దెకు చేరుకుంటుంది. సారలమ్మతో పాటు గోవిందరాజు, పగిడిద్దరాజు వస్తారు. 29న (గురువారం) సాయంత్రం 5గంటలకు సమ్మక్క చిలకల గుట్ట నుంచి గద్దెలకు బయల్దేరుతుంది. 30న (శుక్రవారం) భక్తులకు వనదేవతలు గద్దెలపై కొలువై సంపూర్ణదర్శనం ఇస్తారు. 31న (శనివారం) సాయంత్రం వనదేవతలు వనప్రవేశం చేస్తారు. దీంతో మహాజాతర ముగుస్తుందని వివరించారు. మహా జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ములుగు కలెక్టర్ దివాకర పాల్గొన్నారు.

# 6 గ్యారంటీలను గాలికొదిలేశారా?

**విజన్ డాక్యుమెంట్ పేరిట కొత్త హామీలు దేనికి సంకేతం?**


**సోనియాగాంధీకి కేంద్రమత్రి కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ**



**హైదరాబాద్, డిసెంబరు 21 :** ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలను గాలికొదిలేశారా? అంటూ కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, గ్యారంటీలను పక్కనబెట్టి, విజన్ డాక్యుమెంట్ పేరిట కొత్త హామీలు ఇవ్వడం దేనికి సంకేతమని నిలదీశారు. ఈ మేరకు ఆదివారం సోనియాకు ఆయన బహిరంగ లేఖ రాశారు. 'తెలంగాణ రైజింగ్ - 2047 విజన్ డాక్యుమెంట్ పేరిట రూపొందించిన పుస్తకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వచ్చి స్వయంగా మీకు అందజేశారు. రెండేళ్ల పాలనలో ప్రభుత్వ పనితీరు, రాష్ట్ర అభివృద్ధి విషయంలో ఆయన దూరదృష్టిని మీరు అభినందించారు. కానీ, గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాష్ట్ర పర్యటనకు వచ్చిన మీరు.. అభయహస్తం పేరిట కాంగ్రెస్ పార్టీ రూపొందించిన మేనిఫెస్టోను ఆవిష్కరించారు. అంతే కాకుండా స్వయంగా 6 గ్యారంటీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటుతోంది. మరి మేనిఫెస్టో అమలు గురించి కానీ, మీరు స్వయంగా ప్రకటించిన 6 గ్యారంటీల అమలు గురించి కానీ ఏనాడైనా తెలుసుకోవడానికి ప్రయత్నించారా? కనీసం సీఎం రేవంత్‌రెడ్డి మిమ్మల్ని కలిసినప్పుడైనా వాటి గురించి అడిగారా? రెండేళ్ల పాలన పట్ల సీఎం రేవంత్‌ను మీరు అభినందించారు. అంటే, తెలంగాణ ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు చేశారా? లేదా? అనేది మీకు తెలిసినట్లు లేదు. కనీసం తెలుసుకోవడానికి కూడా మీరు ప్రయత్నించినట్లు లేదు. హామీలను గాలికొదిలేసి తెలంగాణ ప్రజలను వంచిస్తూ కొత్త హామీలు ఇస్తూ మీకు మీరే ఒకరినొకరు అభినందనలు తెలుపుకుంటున్నారు' అని కిషన్‌రెడ్డి లేఖలో పేర్కొన్నారు. ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన 420 హామీలను మూసీ నదిలో కలిపేలేశారా? లేక గాంధీభవన్‌లో పాతరేశారా? తెలంగాణ ప్రజలకు తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# బీఆర్ఎస్‌ను రాష్ట్ర ప్రజలు మరిచిపోయారు

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**



**హైదరాబాద్, డిసెంబరు 21 :** రాష్ట్రంలో బీఆర్ఎసకు భవిష్యత్తు లేదని, ఆ పార్టీని రాష్ట్ర ప్రజలు మరచిపోయారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెసకు ప్రత్యామ్నాయం బీజేపీ మాత్రమేనని స్పష్టం చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణాలో వన్ టైం పాలిటిక్స్(ఓటీపీ) చెల్లబోవని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి విమర్శనాస్త్రాలు సంధించారు. 'నెలల తరబడి ఫాంహౌజ్‌లో ఉండిపోయిన కేసీఆర్ ఇప్పుడు బయటకు రావడం ఓటీపీ లాంటిదే. ఆయన మళ్లీ ఫాంహౌజ్‌కు వెళ్లిపోతారు.. మళ్లీ వస్తారు.. మళ్లీ ఫాంహౌజ్‌కి వెళతారు.' అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పనితీరును, అవినీతిని, ఫ్యూడలిజాన్ని రాష్ట్ర ప్రజలు చూశారని రాంచందర్‌రావు పేర్కొన్నారు. 'హేట్ స్పీచ్ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ఇలాంటి చట్టాన్నే కర్ణాటకలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది. బీజేపీ నాయకులను, కార్యకర్తలను వేధించడానికే హేట్ స్పీచ్ బిల్లు' అని రాంచందర్‌రావు మండిపడ్డారు. సనాతన ధర్మాన్ని విమర్శించేవారిని కాపాడ్డానికి, హిందూత్వ గురించి మాట్లాడేవారిని వేధించడానికే ఈ బిల్లు అని ఆయన ఆరోపించారు. 'హిందూ దేవతల పట్ల హేళనగా మాట్లాడింది కాంగ్రెస్ కాదా? ముస్లింలే కాంగ్రెస్.. కాంగ్రెస్సే ముస్లింలు.. అని అన్నది మీరు కాదా?' అని కాంగ్రెసను రాంచందర్‌రావు నిలదీశారు. సనాతన ధర్మంపై విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసిందే కాంగ్రెస్ అని ఆయన ఆరోపించారు.



# బంగ్లా అక్రమ వలసదారులు అసోంలో స్థిరపడడానికి కాంగ్రెస్ సాయం

**ప్రధాని మోదీ**

**గువాహటి :** బంగ్లాదేశ్ నుంచి వచ్చిన అక్రమ వలసదారులు అసోంలో స్థిరపడేందుకు సాయం చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీ దేశద్రోహ చర్యలకు పాల్పడుతోందని ప్రధాని మోదీ ఆరోపించారు. ఓటు బ్యాంకును బలోపేతం చేసుకోవడమే ఆ పార్టీ లక్ష్యమని, స్థానిక ప్రజల గురించి ఏ మాత్రం పట్టించుకోదని విమర్శించారు. రెండ్రోజుల అసోం పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ.. దిబ్రూగఢ్ జిల్లా నమ్‌రూపలో రూ.10,601 కోట్లతో నిర్మించతలపెట్టిన ఎరువుల కర్మాగారానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. అసోంతో పాటు యావత్ ఈశాన్య ప్రాంతానికి ఇది చరిత్రాత్మకమైన రోజని అన్నారు. నమ్‌రూప్ ఎరువుల కేంద్రంతో స్థానికులకు భారీ ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ఈ కర్మాగారంలో ఏటా 12.7 లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి అవుతుందన్నారు. ఇక్కడ 2030 కల్లా ఉత్పత్తి ప్రారంభమవుతుందని చెప్పారు. కాగా, ఆదివారం ఉదయం గువాహటిలో బ్రహ్మపుత్ర నదిలో విహార నౌకలో మోదీ విద్యార్థులతో మాట్లాడారు. అసోంలోని వేర్వేరు పాఠశాలలకు చెందిన 25 మంది విద్యార్థులతో మోదీ నౌకలో ప్రయాణిస్తూ 'పరీక్షా పే చర్చ'లో భాగంగా ముచ్చటించారు.

# హిందూ సమాజ రక్షణే ఆరెస్సెస్ ధ్యేయం

**బీజేపీ కళ్లద్దాలతో సంఘ్‌ను చూడొద్దు**

**అది చాలా తప్పు ఆరెస్సెస్‌కు రాజకీయ అజెండా లేదు**

**ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ స్పష్టీకరణ**



**కోల్‌కతా :** భారతీయ జనతా పార్టీ కళ్లద్దాలతో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను చూడడం అతిపెద్ద తప్పని ఆ సంస్థ సర్‌సంఘచాలక్ మోహన్ భాగవత్ చెప్పారు. బీజేపీతో ఆరెస్సెస్‌ను పోల్చడం, రాజకీయ కోణంలో చూడడంతో అపార్థాలు తలెత్తుతున్నాయని అన్నారు. ఆరెస్సెస్‌కు ఎలాంటి రాజకీయ అజెండా లేదని, హిందూ సమాజాన్ని సంరక్షించడంతో పాటు అభివృద్ధికి పాటుపడడమే లక్ష్యమని భాగవత్ స్పష్టం చేశారు. హిందువులు జాగృతమయ్యారని, భారత్ త్వరలోనే విశ్వగురు స్థానానికి తిరిగి చేరుకుంటుందని, ఇదే సంఘ్ లక్ష్యమని చెప్పారు. ఆర్ఎస్ఎస్ వందేళ్ల వేడుకల సందర్భంగా కోల్‌కతాలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సంఘ్‌కు శత్రువుల్లేరని, అయితే ఆర్ఎస్ఎస్ విస్తరిస్తున్న కొద్దీ కొందరు స్వార్థపరుల దుకాణాలు మూతపడుతున్నాయని ఆయన వ్యంగ్యంగా అన్నారు. సంఘ్‌పై అభిప్రాయాలు వ్యక్తం చేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, అయితే ఆ అభిప్రాయాలు వాస్తవాల ఆధారంగా ఏర్పరచుకుంటే బాగుంటుందని చెప్పారు. సంఘ్‌పై జరిగే దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ వాస్తవాలను ప్రజల ముందు ఉంచేందుకు కోల్‌కతాతో పాటు ముంబై, ఢిల్లీ, బెంగళూరులో కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. స్థానిక ఉత్పత్తులనే కొనాలని భాగవత్ పిలుపునిచ్చారు. ఇతర దేశాల భాషల కన్నా మాతృభాషలో మాట్లాడటానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

# బస్తర్‌లో ఆఖరి యుద్ధానికి సిద్ధం!

**ఆపరేషన్లు ముమ్మరం చేసిన భద్రతా బలగాలు**

**మావోయిస్టు కీలక నేతలు పాపారావు, దేవాలపై దృష్టి**

**బీజాపూర్ :** వచ్చే ఏడాది మార్చి 31 నాటికి వామపక్ష తీవ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో కేంద్రం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా ఓవైపు మావోయిస్టు కీలక నేతల ఎన్‌కౌంటర్లతో పాటు మరోవైపు సరెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. గత నెలలో మావోయిస్టు టాప్ కమాండర్ హిడ్మాను ఎన్‌కౌంటర్ చేసిన భద్రతా బలగాలు.. ఇప్పుడు పాపారావు అలియాస్ మోంగు, బర్సా దేవా అనే మరో ఇద్దరు కీలక నేతలపై దృష్టి సారించాయి. వీరిద్దరూ నిషేధిత సీపీఐ(మావోయిస్టు) పార్టీ కేంద్ర కమిటీలో సభ్యులు కానప్పటికీ.. వారి లోతైన స్థానిక సంబంధాలు, ఛత్తీసగఢ్ దక్షిణ బస్తర్ (ఇక్కడ ఇప్పటికీ సుమారు 150 మంది సాయుధ క్యాడర్ ఉన్నట్లు అంచనా)లోని విశాలమైన ప్రాంతాలపై ఉన్న పట్టు.. వారిద్దరినీ భద్రతా బలగాల మోస్ట్ వాంటెట్ జాబితాలో చేర్చాయి. 48 ఏళ్ల బర్సా దేవా మావోయిస్టు పార్టీ కీలకమైన గెరిల్లా బెటాలియన్‌కు నాయతక్వం వహిస్తున్నారు. ఆయన సుక్మా జిల్లాలోని హిడ్మా స్వగ్రామం పూవర్తికి చెందిన వ్యక్తే కావడం గమనార్హం. 57 ఏళ్ల పాపారావు సుక్మా జిల్లాలోని కిష్టారానికి చెందిన గిరిజనుడు. వీరిద్దరూ మావోయిస్టుల ప్రధాన కేంద్రమైన దక్షిణ బస్తర్‌కు ఇన్‌చార్జిలుగా ఉన్నారు. బర్సా దేవా నేతృత్వంలోని 'ది పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ)' బెటాలియన్ ఒక్కటే ఇంకా క్రియాశీలంగా ఉందని బస్తర్ ఐజీ పీ సుందర్‌రాజ్ వెల్లడించారు. భద్రతా బలగాలు ఇప్పుడు పాపారావు, దేవాలను గుర్తించేందుకు ఆపరేషన్లను ముమ్మరం చేశాయి.

**యుద్ధభూమి బస్తర్..!**

2025లో డిసెంబరు 9 వరకు బస్తర్‌లో 96 ఎన్‌కౌంటర్ల ఘటనలు జరిగాయి. వీటిల్లో 252మంది యావోయిస్టులు మరణించగా.. 23మంది భద్రతా సిబ్బంది చనిపోయారు. బస్తర్ రీజియన్ ఏళ్లుగా ఎంతటి యుద్ధభూమిగా కొనసాగిందో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. భద్రతా బలగాల ఎన్‌కౌంటర్లలో చనిపోయిన వారిలో సీపీఐ(మావోయిస్టు) చీఫ్ నంబాల కేశవరావు అలియాస్ బసవరాజుతో పాటు మరో ముగ్గురు కేంద్ర కమిటీ సభ్యులు కూడా ఉన్నారు. కాగా, ఇదే సమయంలో పోలీస్ ఇన్‌ఫార్మర్ల నెపంతో ఈ ఏడాదిలో మావోయిస్టులు 46 మంది పౌరులను చంపేశారు. దేశంలో మావోయిస్టు ప్రభావిత జిల్లాల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. 2014లో 126 మావోయిస్టు ప్రభావిత జిల్లాలు ఉండగా.. ఈ ఏడాదికి ఆ సంఖ్య 11కు పడిపోయింది.

# 'వీబీ- జీ రామ్ జీ' పథకం రాష్ట్రపతి ఆమోదం..

**ఉపాధికి మరింత గ్యారంటీ.. పని దినాల పెంపు**

**ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పథకం**

**వీబీ- జీ రామ్ జీ పథకంపై వివరణ ఇచ్చిన కేంద్రం**

**న్యూఢిల్లీ :** దేశంలో కోట్లాది మంది గ్రామీణ పేదలు, కూలీలకు ఉపాధి కల్పిస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ) పేరును కేంద్ర ప్రభుత్వం మార్చటంతోపాటు అందులో కొన్ని మార్పులు కూడా చేయటంపై పార్లమెంటులో ఇటీవల ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరాలు తెలిపాయి. ఈ పథకాన్ని మోదీ సర్కారు 'వికసిత్ భారత్- గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్)'గా మార్చింది. దీనినే సంక్షిప్తంగా 'వీబీ- జీ రామ్ జీ'గా పిలుస్తున్నారు. ఈ బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదివారం ఆమోదముద్ర వేయటంతో చట్టంగా మారింది. కేంద్రం ఈ పథకం అసలు ఉద్దేశాన్ని చంపేసిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తుండగా, ఆధునిక గ్రామీణ అవసరాలకు తగినట్లుగా పథకంలో మార్పులు చేశామని మోదీ సర్కారు చెబుతోంది. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ కంటే ఇది ఉత్తమమైనదని వాదిస్తోంది. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ కంటే జీ రామ్ జీ ఎందుకు ఉత్తమమైదో వివరిస్తూ కేంద్ర ప్రభుత్వ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఒక నోట్‌ను విడుదల చేసింది. అందులోని వివరాలు ఇవీ....



**1.వీబీ- జీ రామ్ జీ బిల్ -2025 అంటే ఏమిటి?**

ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ చట్టంలో సంస్కరణలు చేస్తూ తీసుకొచ్చిందే వీబీ- జీ రామ్ జీ బిల్-2025. వికసిత్ భారత్-2047 మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా ఆధునిక కార్యక్షేత్రాన్ని నిర్మించటమే దీని లక్ష్యం. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయటానికి సిద్ధంగా ఉన్న కూలీలకు ఈ చట్టం సంవత్సరంలో 125 రోజులు ఉపాధికి హామీ ఇస్తుంది.

**2. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏతో పోల్చితే వీబీ- జీ రామ్ ఏ విధంగా మెరుగైనది?**

ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ ద్వారా ఒక వ్యక్తికి సంవత్సరంలో 100 రోజులు ఉపాధికి హామీ లభించగా, వీబీ- జీ రామ్ జీ 125 రోజుల ఉపాధికి హామీ ఇచ్చింది. పాత పథకం మాదిరిగా కాకుండా ఈ కొత్త పథకం బలమైన మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టింది. ప్రధానంగా ప్రజలకు నీటి భద్రత, గ్రామీణ ప్రధాన మౌలిక వసతులు, జీవ-నోపాధి మౌలిక వసతులు, వాతావరణ పరిస్థితులను స్థిరీకరించే (వాతావరణ మార్పుల వల్ల కలిగే దుష్ప్రభావాలను నిరోధించటం) పనులు అనే 4 అంశాలపై దృష్టి పెట్టింది.

**3. కొత్త పథకం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఏ విధంగా ప్రయోజనం కలిగిస్తుంది?**

ఈ పథకం చెరువులు, కుంటల వంటి నీటి వనరుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తుంది. మిషన్ అమృత్ సరోవర్ ద్వారా దేశవ్యాప్తంగా 68,000 పైచిలుకు నీటి వనరుల పునరుద్ధరణ ద్వారా వ్యవసాయానికి నీటి వసతితోపాటు



భూగర్భ జల మట్టం పెంచేందుకు వీలు కల్పిస్తుంది. పక్కా రోడ్లు, గ్రామాల అనుసంధానం, అత్యవసరమైన సేవల కల్పన ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఊతమిస్తుంది. ఉపాధికి హామీ ఇవ్వటం ద్వారా కరువు కారణంగా ఏర్పడే ప్రజల వలసలను నిరోధిస్తుంది. డిజిటల్ హాజరు, కూలీలకు నేరుగా వేతనాల చెల్లింపు, డాటా ఆధారిత ప్రణాళికల ద్వారా జవాబుదారీతనాన్ని పెంచుతుంది.

**4. కొత్త పథకం ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలు ఏమిటి?**

పంటలు వేసే, కోసే కాలాల్లో రైతులకు కూలీల కొరత రాకుండా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు 60 రోజుల పాటు పనులును నిలిపివేసే అవకాశం ఈ పథకం కల్పిస్తుంది. తద్వారా కూలీ రేట్ల కృత్రిమ పెంపును నిరోధించవచ్చు. ఆహార ధాన్యాల ఉత్పత్తి వ్యయాన్ని నియంత్రించవచ్చు. చెరువులు, కుంటల వంటి నీటి వసతులను పునరుద్ధరించటం, కొత్తవి ఏర్పాటు చేయటం ద్వారా ఒకటికంటే ఎక్కువ పంటలు పండించవచ్చు.

**5. కూలీలకు ఈ పథకం ద్వారా లాభమేంటి?**

కూలీలకు ఏటా 125 రోజులు ఉపాధికి హామీ ఇవ్వటం ద్వారా వారి ఆదాయాన్ని 25 శాతం పెంచుతుంది. నిర్ణీత సమయంలో కూలీలకు ఉపాధి కల్పించలేకపోతే రాష్ట్రాలు నిరుద్యోగ భృతి చెల్లించాల్సి ఉంటుంది.

**6. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ పథకాన్ని మార్చాల్సిన అవసరం ఏమిటి?**

ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ పథకాన్ని 2005 నాటి భారత గ్రామీణ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించారు. ఆ తర్వాత గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ఎన్నో మార్పులు వచ్చాయి. నేడు గ్రామాల్లో బలమైన సామాజిక భద్రతా వ్యవస్థ ఉంది. కనెక్టివిటీ పెరిగింది. డిజిటల్ సేవలు పెరిగాయి. గ్రామాణ జీవనోపాధి అవకాశాలు విస్తృతమయ్యాయి. అందువల్ల ప్రస్తుత గ్రామీణ పరిస్థితులకు ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ పథకం పనికిరాదు.

**7. కొత్త చట్టంలో పారదర్శకత, సామాజిక భద్రతకు సంబంధించిన అంశాలు ఏమున్నాయి?**

మోసాలను గుర్తించేందుకు కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థ. పథకంపై పర్యవేక్షణకు కేంద్ర, రాష్ట్రాల సంయుక్త స్టీరింగ్ కమిటీ. పథకంపై గ్రామ పంచాయతీ పర్యవేక్షణ అధికారాలను విస్తృతం చేయటం. జీపీఎస్, మొబైల్ ఆధారిత పర్యవేక్షణ.

**8. రాష్ట్రాలపై ఆర్థిక భారం పెరుగుతుందా?**

పథకం అమలులో కేంద్ర, రాష్ట్రాలు వ్యయాన్ని 60:40 శాతం భరించాలి. ఈశాన్య రాష్ట్రాలు, హిమాయల పర్వత ప్రాంత రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఇది 90:10 నిష్పత్తిలో ఉంటుంది.

# రైలు టికెట్ల ధరల పెంపు!

**కిలో మీటరుకు 1-2 పైసలు చొప్పున పెంచిన రైల్వే శాఖ.. ఈ నెల 26 నుంచే అమలు**

**215 కి.మీ.లోపు ప్రయాణానికి ఎలాంటి పెంపూ వర్తించదు**

**న్యూఢిల్లీ :** రైలు ప్రయాణికుల చార్జీలు పెంచుతూ.. భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. రైలు స్థాయిని బట్టి కిలో మీటరుకు 1 నుంచి రెండు పైసల చొప్పున పెంచుతున్నట్టు తెలిపింది. ఈ పెంపు ఈ నెల 26 నుంచి అమల్లోకి రానుంది. తద్వారా రైల్వేకు రూ.600 కోట్ల మేరకు అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉందని వివరించింది. 215 కిలోమీటర్ల దూరాన్ని మించి ప్రయాణించే వారికే ఈపెంపు వర్తిస్తుందని రైల్వే శాఖ తెలిపింది. ఆర్డినరీ రైళ్లలో 215 కిలో మీటర్లు దాటి ప్రయాణించే వారికి.. కిలోమీటరుకు 1 పైసా చొప్పున, మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లలో నాన్ ఏసీ, ఏసీ తరగతుల్లో ప్రయాణించేవారికి కిలో మీటరుకు 2 పైసల చొప్పున టికెట్ ధరలు పెరగనున్నాయి. నాన్‌ఏసీ రైళ్లలో 500 కి.మీ. దూరం ప్రయాణించేవారు.. రూ.10 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఇక, సబర్బన్, నెలవారీ సీజన్ టికెట్‌లు తీసుకునే వారికి ఈ పెంపు వర్తించదు. కాగా.. ఈ ఏడాదిలో టికెట్ ధరలు పెంచడం ఇది రెండోసారి. ఈ ఏడాది జూలైలో పెంచిన టికెట్ ధరలతో శాఖకు రూ.700 కోట్లకుపైగా అదనపు ఆదాయం చేకూరింది. కాగా, క్రిస్మస్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా 8 జోన్లలో 244 అదనపు రైళ్లను నడపనున్నట్టు రైల్వే శాఖ తెలిపింది. ప్రయాణికుల అవసరాలు, రద్దీని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. అవసరాన్ని బట్టి మరిన్ని రైళ్లను కూడా అందుబాటులోకి




తీసుకురానున్నట్టు వివరించింది. 2014-25 మధ్య కాలంలో 2 లక్షల వ్యాగన్లను సమకూర్చుకున్నట్టు శాఖ వివరించింది. అదేవిధంగా 10 వేలకుపైగా లోకోమోటివ్‌లను పెంచినట్టు తెలిపింది.

**సిబ్బంది ఏరీ?**

డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్(డీఎఫసీ) ఏర్పాటుకు కేంద్రం ఆగమేఘాలపై చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో పార్లమెంటరీ స్థాయీ సంఘం ఈవ్యవహారంపై ఆక్షేపణ వ్యక్తం చేసింది. తగిన సిబ్బంది లేకుండా.. డీఎఫసీ ప్రయోగం ఎందుకని ప్రశ్నించింది. నిపుణులైన సిబ్బంది డీఎఫసీకి అవసరమని పేర్కొంది. కానీ, ప్రస్తుతం సిబ్బంది లేరని.. ఇది ప్రధాన సవాలుగా మారుతుందని అభిప్రాయపడింది. డీఎఫసీ కింద హైకెపాసిటీ ట్రాక్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా మరింత సమర్థవంతంగా, వేగంగా రైళ్లను నడపాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. అయితే.. లక్ష్యం బాగున్నా సిబ్బంది లేకపోవడాన్ని పార్లమెంటరీ స్థాయీ సంఘం తప్పుబట్టింది. ఈ విషయాన్ని రైల్వే శాఖ కూడా అంగీకరించడం గమనార్హం. లోకో పైలట్లు 1,42,814 మంది ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం 1,07,928 మంది మాత్రమే ఉన్నారు. గూడ్స్ ట్రైన్ మేనేజర్లు 22,082 మంది ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం 12,345 మంది మాత్రమే ఉన్నారు. అదేవిధంగా స్టేషన్ మాస్టర్లు 2,06,495 మంది ఉండాల్సి ఉండగా.. 1,59,219 మంది మాత్రమే ఉన్నారు. ఈ సమస్యను సత్వరమే పరిష్కరించాలని స్థాయీ సంఘం స్పష్టం చేసింది.

# 7 ఉన్నత విద్యాసంస్థల్లో అంతరిక్ష ప్రయోగశాలలు

**న్యూఢిల్లీ :** దేశంలో అంతరిక్ష రంగాన్ని ప్రోత్సహించేందుకు ఏర్పాటుచేసిన ఇన్‌స్పేస్.. అంతరిక్ష సాంకేతిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. దేశవ్యాప్తంగా ఏడు ఉన్నత విద్యా సంస్థల్లో అంతరిక్ష ప్రయోగశాల (స్పేస్ ల్యాబ్)లు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఈ నిమిత్తం ప్రతిపాదన కోసం అభ్యర్థన (రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్)ను జారీచేసింది. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన ఉన్నత విద్యా సంస్థల్లో అత్యాధునిక వసతులతో కూడిన అంతరిక్ష ప్రయోగశాలలు ఏర్పాటు చేయాలనేది ఇన్‌స్పేస్ లక్ష్యం. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా ఏడు వేర్వేరు జోన్ల నుంచి దశలవారీగా ఏడు విద్యాసంస్థలను ఎంపిక చేస్తారు. వీటిలో ఏర్పాటు చేసే స్పేస్ ల్యాబ్‌ల కోసం ఇన్‌స్పేస్ 75 శాతం వరకు ఆర్థిక సాయం అందిస్తుంది. ఒక్కో సంస్థకు రూ.5 కోట్ల పరిమితితో విడతల వారీగా నగదు అందిస్తుంది.

# లంకపై భారత్ ఘన విజయం

## అజేయ అర్ధసెంచరీతో విజృంభణ

## టీ20 సిరీస్‌లో 1-0తో ముందంజ



**విశాఖపట్నం :** శ్రీలంకతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత మహిళల జట్టు అదిరిపోయే బోణీ కొట్టింది. ఆదివారం ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగిన తొలి టీ20 పోరులో టీమ్‌ఇండియా 8 వికెట్ల తేడాతో లంకపై ఘన విజయం సాధించి 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. స్వదేశం వేదికగా జరిగిన వన్డే ప్రపంచకప్‌లో టైటిల్ గెలిచిన తర్వాత తొలిసారి బరిలోకి దిగిన భారత్ సమష్టి ప్రదర్శనతో సత్తాచాటింది. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో లంకను స్వల్ప స్కోరుకే కట్టడి చేసిన భారత్ లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. లంక నిర్దేశించిన 122 పరుగుల లక్ష్యాన్ని టీమ్‌ఇండియా 14.4 ఓవర్లలో 122/2 స్కోరు చేసింది. యువ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్(44 బంతుల్లో 69 నాటౌట్, 10ఫోర్లు) అజేయ అర్ధసెంచరీతో కదంతొక్కింది. రోడ్రిగ్స్‌కు తోడు ఓపెనర్ స్మృతి మందన(25) ఆకట్టుకుంది. కావ్య కవింది(1/20), ఇనోక రణవీర(1/17) ఒక్కో వికెట్ తీశారు. తొలుత లంక నిరీత 20 ఓవర్లలో 121/6 స్కోరుకు పరిమితమైంది. ఓపెనర్ విశ్మి గుణరత్నె(39) ఆట్టుకోగా, మిగతావారు తేలిపోయారు. దీప్తిశర్మ(1/20), క్రాంతిగౌడ్(1/23), శ్రీచరణి(1/30) రాణించారు. అర్ధసెంచరీతో జట్టు విజయంలో కీలకమైన జెమీమా రోడ్రిగ్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఇరు జట్ల మధ్య రెండో టీ20 పోరు ఈనెల 23న ఇక్కడే జరుగనుంది.

ఆది నుంచే కట్టడి : టాస్ గెలిచిన టీమ్‌ఇండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్ మరో ఆలోచన లేకుండా లంకను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. కెప్టెన్ నమ్మకాన్ని నిలబెడుతూ భారత బౌలర్లు లంకను ఆదిలోనే దెబ్బతీశారు. ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లో కెప్టెన్ చమరీ ఆటపట్టు(15)ను క్రాంతిగౌడ్ క్లీన్‌బౌల్డ్ చేయగా, లంక 18 పరుగులకే తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన హాసిని పెరెరా (20).. విశ్మికి జత కలిసింది. ఈ ఇద్దరు ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. అయితే బౌలింగ్ మార్పుగా వచ్చిన దీప్తిశర్మ..హాసినిని ఔట్ చేయడంతో రెండో వికెట్‌కు 31 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. హర్షిత సమరవిక్రమ (21), హాసిని..భారత బౌలర్లను నిలువరించే ప్రయత్నం చేశారు. ఈ ఇద్దరు అడపాదడపా బౌండరీలు బాదుతూ స్కోరుబోర్డుకు కీలక పరుగులు జతచేశారు. 16 పరుగుల తేడాతో వీరిద్దరు ఔట్ కావడంతో లంక కష్టాలు మళ్లీ మొదటికి వచ్చాయి. నీలాక్షిక సిల్వా(8), కవిశ్క దిల్హారి(6) రనౌట్లుగా వెనుదిరుగడంతో



లంక స్వల్ప స్కోరుకు పరిమితమైంది.

జెమీమా దూకుడు : లక్ష్యఛేదనలో భారత్‌కు మెరుగైన శుభారంభం దక్కలేదు. డాషింగ్ ఓపెనర్ షెఫాలీవర్మ(9) సింగిల్ డిజిట్‌కే వైదొలుగడంతో ఇన్నింగ్స్ బాధ్యతను మందన, జెమీమా రోడ్రిగ్స్ భుజానెత్తుకున్నారు. వీరిద్దరు లంక బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. మెగాటోర్నీ ఫామ్‌ను కొనసాగిస్తూ జెమీమా లంక బౌలర్లపై విరుచుకుపడింది. పవర్‌ప్లేను అనుకూలంగా మలుచుకుంటూ బౌండరీలతో చెలరేగింది. సాఫీగా సాగుతున్న ఇన్నింగ్స్‌లో రణవీర బౌలింగ్‌లో మందన ఔట్ కావడంతో రెండో వికెట్‌కు 54 పరుగుల పార్ట్‌నర్‌షిప్‌నకు బ్రేక్ పడింది. మందన ఔటైనా జెమీమా తన దూకుడు తగ్గించలేదు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్(15 నాటౌట్)తో కలిసి జెమీమా..జట్టును లక్ష్యం వైపు సాఫీగా నడిపించింది. మంచు ప్రభావంతో లంక బౌలర్లు తేలిపోవడం భారత బ్యాటర్లకు సులువైంది.

1 అంతర్జాతీయ టీ20ల్లో నాలుగు వేల పరుగులు పూర్తి చేసిన తొలి భారత బ్యాటర్‌గా మందన నిలిచింది. ఓవరాల్‌గా సుజీ బేట్స్ (4716) టాప్‌లో ఉంది.

సంక్షిప్త స్కోర్లు

శ్రీలంక: 20 ఓవర్లలో 121/6(విశ్మి 39, హర్షిత 21, దీప్తిశర్మ 1/20, కాంత్రిగౌడ్ 1/23),

భారత్: 14.4 ఓవర్లలో 122/2(జెమీమా 69 నాటౌట్, మందన 25, రణవీర 1/17, కావ్య 1/20)

# బీడబ్ల్యూఎఫ్ విజేత అన్ సె యంగ్



హంగ్జౌ(చైనా): ప్రతిష్టాత్మక బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్ టోర్నీలో అన్ సె యంగ్ టైటిల్ విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ అన్ సె యంగ్ 21-13, 18-21, 21-10తో వాంగ్ జీ యిపై అదుతే విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన తుదిపోరులో అన్ సె యంగ్ తనదైన రీతిలో ప్రత్యర్థిని మట్టికరిపించింది. తొలి గేమ్‌ను 21-13తో కైవసం చేసుకున్న ఈ యువ షట్లర్‌కు రెండో గేమ్‌లో చుక్కెదురైంది. అయితే నిరయాత్మక మూడో గేమ్‌లో ప్రత్యర్థికి ఏ మాత్రం అవకాశమివ్వని ఈ దక్షిణకొరియా షట్లర్ గేమ్‌తో పాటు మ్యాచ్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఈ క్రమంలో ఈ ఏడాది 11వ టైటిల్ దక్కించుకోవడం ద్వారా జపాన్ దిగ్గజ షట్లర్ కెంటో మెమోటో సరసన అన్ సె యంగ్ నిలిచింది. ఫైనల్‌కు చేరుకునే కనీసం ఒక్క గేమ్‌ను కోల్పోని అన్ సె యంగ్..జపాన్ స్టార్ షట్లర్ అకానె యమగుచిని ఓడించడం విశేషం.



# ఆసీస్‌దే యాషెస్..

## ఇంగ్లండ్‌పై మూడో టెస్టులో ఘన విజయం

## సిరీస్‌లో 3-0తో ముందంజ

అడిలైడ్ : ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌ను ఆతిథ్య ఆస్ట్రేలియా తిరిగి దక్కించుకుంది. ఇంగ్లండ్‌తో జరిగిన మూడో టెస్టులో ఆసీస్ 82 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తద్వారా ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే 3-0తో కైవసం చేసుకుంది. ఆసీస్ నిర్దేశించిన 435 పరుగుల భారీ లక్ష్యఛేదన కోసం ఓవర్‌నైట్ స్కోరు 207/6తో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన ఇంగ్లండ్ 352 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్ జెమీ స్మిత్(60), విల్ జాక్స్(47) జట్టును గెలిపించే ప్రయత్నం చేశారు. అయితే సిరీస్‌లో సూపర్ ఫామ్‌మీదున్న మిచెల్ స్టార్క్(3/62) ఇంగ్లండ్‌ను దెబ్బతీయడంలో కీలకమయ్యాడు. ఆసీస్ బౌలింగ్‌కు ఎదురొడ్డి నిలుస్తూ స్మిత్, జాక్స్ సాధికారిక ఇన్నింగ్స్ ఆడారు.

ముఖ్యంగా వికెట్‌కీపర్, బ్యాటర్ స్మిత్ తన ఇన్నింగ్స్‌లో ఏడు ఫోర్లు, రెండు భారీ సిక్స్‌లతో ఆకట్టుకున్నాడు. ఇన్నింగ్స్ సాఫీగా సాగుతున్న దశలో స్టార్క్ బౌలింగ్‌లో స్మిత్ ఔట్ కావడంతో ఏడో వికెట్‌కు 91 పరుగుల కీలక భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. బ్రాండన్ కార్స్(39 నాటౌట్)తో జత కలిసిన జాక్స్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. వీరిద్దరు కంగారూ బౌలర్ల సహనానికి పరీక్ష పెట్టారు. స్టార్క్ బౌలింగ్‌లో లబుషేన్ కండ్లు చెదిరే క్యాచ్‌తో జాక్స్ ఔట్ కావడంతో ఇంగ్లండ్ ఓటమి ఖాయమైంది. 15 పరుగుల తేడాతో ఆర్చర్(3), టంగ్(1) వెంటవెంటనే ఔట్ కావడంతో ఆసీస్ గెలుపు సంబురాల్లో మునిగి పోయింది. సెంచరీకి తోడు అర్ధసెంచరీ, ఆరు క్యాచ్‌లతో అలెక్స్ క్యారీ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. ఈనెల 26 నుంచి ఇరు జట్లు మెల్‌బోర్న్ వేదికగా బాక్సింగ్ డే టెస్టు మొదలుకానుంది.

# విండీస్ లక్ష్యం 462, ప్రస్తుతం 43/0



మౌంట్ మౌంగనుయి(న్యూజిలాండ్) : న్యూజిలాండ్, వెస్టిండీస్ జట్ల మధ్య మూడో టెస్టు రసవత్తరంగా సాగుతున్నది. పరుగుల వరద పారుతున్న పోరులో ఆధిక్యం చేతులు మారుతున్నది. కివీస్ నిర్దేశించిన 462 పరుగుల భారీ లక్ష్యఛేదన కోసం బ్యాటింగ్‌కు దిగిన విండీస్ వికెట్ నష్టపోకుండా 43 పరుగులు చేసింది. కివీస్ బౌలర్లకు ఏమాత్రం అవకాశమివ్వకుండా ఓపెనర్లు బ్రాండన్‌కింగ్ (37), జాన్ క్యాంప్‌బెల్ (2) క్రీజులో ఉన్నారు.

అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 381/6 నాలుగో రోజు ఆదివారం తొలి ఇన్నింగ్స్‌కు దిగిన విండీస్ 420 పరుగులకు ఆలౌటైంది. కవెమ్ హాడ్జ్(123 నాటౌట్) అజేయ సెంచరీతో కదంతొక్కాడు. జాకబ్ డఫీ(4/86), ఇజాజ్ పటేల్ (3/113) ఆకట్టుకున్నారు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన కివీస్ 54 ఓవర్లలో 306/2 వద్ద రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. ఓపెనర్లు టామ్ లాథమ్ (101), డెవాన్ కాన్వె (100) దూకుడైన బ్యాటింగ్‌తో సెంచరీలు సాధించారు. వీరిద్దరు కలిసి తొలి వికెట్‌కు 192 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. కవెమ్ హాడ్జ్(2/80)కు రెండు వికెట్లు దక్కాయి.

# అండర్-19 ఆసియా కప్ విజేత పాకిస్థాన్

## మన కుర్రాళ్ల ఫ్లాప్ షో

## వైభవ్ విఫలం

## సమీర్ అదిరే శతకం



దుబాయ్: ఓటమనేదే లేకుండా ఫైనల్ చేరిన యువ భారత్.. కీలక పోరులో ఘోరంగా విఫలమైంది. ఆదివారం ఏకపక్షంగా జరిగిన అండర్-19 ఆసియా కప్ టైటిల్ ఫైట్‌లో 191 పరుగుల తేడాతో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ చేతిలో చిత్తయింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పాక్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 347 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ సమీర్ మిన్హాస్ (113 బంతుల్లో 172) శతకంతో విరుచుకుపడడంతో భారత బౌలర్లకు దిక్కుతోచలేదు. అహ్మద్ హుస్సేన్ (56) హాఫ్ సెంచరీ చేశాడు. దీపేష్ దేవేంద్రన్ మూడు వికెట్లు పడగొట్టగా.. హనిల్, ఖిలన్ చెరో రెండు వికెట్లు దక్కించుకొన్నారు. అనంతరం ఛేదనలో భారత్ 26.2 ఓవర్లలో 156 పరుగులకు కుప్పకూలింది. దీపేష్ (36) టాప్ స్కోరర్. భారీ ఛేదనలో భారత్ టపటపా వికెట్లు చేజార్చుకొంది. కెప్టెన్ ఆయుష్ మాత్రే (2), వైభవ్ సూర్యవంశీ (26)ని అలీ రెజా పెవిలియన్ చేర్చడంతో.. భారత్ ఏ దశలోనూ ఛేదించే విధంగా కనిపించలేదు. పాక్ పేసర్ల షార్ట్ పిచ్ బంతులకు మనోళ్ల వద్ద సమాధానమే లేకపోయింది. అలీ రెజా నాలుగు వికెట్లు పడగొట్టగా.. సుభాన్, ఎహ్‌సాన్, సయ్యమ్ తలో రెండు వికెట్లు సొంతం చేసుకొన్నారు. పాక్ ఆటగాళ్లతో 'నో హ్యాండ్ షేక్' పాలసీని మన క్రికెటర్లు ఈ మ్యాచ్‌లో కూడా పాటించారు.

**కాలి దుమ్ముతో సమానం**

ధాటిగా ఆడే క్రమంలో వైభవ్ వికెట్ పారేసుకొన్నాడు. అతడు అవుటై తిరిగి వెళ్తున్న సమయంలో పాక్ బౌలర్ అలీ రెజా సంబరాలు సూర్యవంశీకి ఆగ్రహం తెప్పించాయి. దీంతో వెనక్కితిరిగి నోటికి పనిచెప్పిన వైభవ్.. నువ్వు నా బూటుకు అంటిన దుమ్ముతో సమానం అన్నట్టుగా వేలు చూపిస్తూ సంజ్ఞ చేశాడు. అంతకుముందు భారతకెప్టెన్ ఆయుష్ అవుటై వెళుతున్నప్పుడు కూడా అలీ రెజా రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించాడు. దీంతో డగౌట్‌కు వెళ్తున్న ఆయుష్ ఆగ్రహంతో వెనక్కి వచ్చి ఏదో అన్నాడు.

**ట్రోఫీని బహూకరించిన నఖ్వీ**

ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ) చీఫ్, పాకిస్థాన్ మంత్రి అయిన మొహిసిన్ నఖ్వీ విజేతలకు పతకాలు, ట్రోఫీని ప్రదానం చేశారు. అయితే, భారత్‌కు చెందిన ప్రతినిధులు ఎవరూ ఈ కార్యక్రమంలో కనిపించలేదు. రన్నరప్ చెక్‌ను అఫానిస్థాన్ క్రికెట్ బోర్డు చైర్మన్ మిర్వాసి అష్రఫ్ చేతుల మీదుగా భారత కెప్టెన్ ఆయుష్ అందుకొన్నాడు. కాగా, పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో.. నఖ్వీ నుంచి భారత సీనియర్ జట్టు ఆసియా కప్‌ను అందుకొనేందుకు నిరాకరించిన సంగతి తెలిసిందే.

# ఆకాశం నుంచి ఆపద.. 'శంబాల' మిస్టరీ!



యంగ్ హీరో ఆది సాయికుమార్ ఈసారి రొటీన్ కమర్షియల్ సినిమాలకు దూరంగా, ఒక డిఫరెంట్ కాన్సెప్ట్ తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. 'శంబాల' అనే టైటిల్ తోనే ఆసక్తి రేపిన ఈ సినిమా, సూపర్ నేచురల్ థ్రిల్లర్ గా రూపొందింది. ఇప్పటికే రిలీజైన టీజర్, గ్లింప్స్ సినిమాపై పాజిటివ్ వైబ్స్ క్రియేట్ చేశాయి. ఇక లేటెస్ట్ గా ఈ మూవీ ట్రైలర్ ను నేచురల్ స్టార్ నాని లాంచ్ చేయడంతో సినిమాపై బజ్ ఒక్కసారిగా పెరిగిపోయింది. విజువల్స్ ఎంత గ్రాండ్ గా ఉన్నాయో, అందులో ఆది చెప్పిన డైలాగ్స్ అంతకు మించి ఉన్నాయి. ట్రైలర్ కట్ చేసిన విధానం చూస్తుంటే, ఆది ఈసారి గట్టిగానే కొట్టేలా ఉన్నాడు. ట్రైలర్ ఆరంభమే ఒక మిస్టరీతో మొదలైంది. ఆకాశం నుంచి ఒక ఊహించని ఉల్క పడటం, దాని చుట్టూ అల్లుకున్న కథ అని క్లియర్ గా తెలుస్తోంది. "పంచభూతాల్ని శాసిస్తోందంటే.. ఇది సాధారణమైంది కాదు" అనే బ్యాక్ గ్రౌండ్ వాయిస్ సినిమాలోని ఇంటెన్సిటీని ఎలివేట్ చేసింది. ఒక అతీంద్రియ శక్తికి, మనుషులకు మధ్య జరిగే వార్ లా అనిపిస్తోంది. హీరో ఆది క్యారెక్టరైజేషన్ ఇందులో చాలా కొత్తగా ఉంది. ఒక సైంటిస్ట్ గా మూఢనమ్మకాలను అస్సలు నమ్మని వ్యక్తిగా ఆయన కనిపించారు. "మీ కాకమ్మ కాశీ మజిలీ కథలు ఊరు జనాలకు చెప్పండి.. నాకు కాదు" అని ఆది చెప్పే డైలాగ్, ఆయన ఆటిట్యూడ్ ను పర్ఫెక్ట్ గా చూపిస్తోంది. శాస్త్రాన్ని నమ్మే ఊరికి, సైన్స్ ను నమ్మే హీరోకి మధ్య వచ్చే క్లాష్ చాలా ఇంట్రెస్టింగ్ గా ఉండబోతోంది. యాక్షన్ పార్ట్ కూడా ట్రైలర్ లో హైలైట్ అయ్యింది. ముఖ్యంగా బలి ఇచ్చే కాన్సెప్ట్ ను హీరో ఎదిరించే సీన్ గూస్ బంప్స్ తెప్పిస్తోంది. "ఇప్పటి నుంచి మీ పిచ్చితనానికి ఎవరినీ బలి కానివ్వను.. అది ఆవు అయినా సరే.. చీమ అయినా సరే" అని ఆది వార్నింగ్ ఇచ్చే సీన్ మాస్ ఆడియెన్స్ కు బాగా కనెక్ట్ అవుతుంది. విలన్స్ ను ఎదుర్కోవడానికి ఆది చేసే ఫైట్స్ కూడా చాలా స్టైలిష్ గా డిజైన్ చేశారు. మరోవైపు కథలో దైవత్వంను కూడా బలంగా టచ్ చేశారు. "విధి నిన్ను ఇక్కడికి రప్పించింది.. నువ్వే ఈ సమస్యకి కొత్త పరిష్కారం కనిపెడతావేమో" అనే డైలాగ్ సినిమాలోని అసలు పాయింట్ ను రివీల్ చేస్తోంది. ఆ గ్రామాన్ని కాపాడాల్సిన బాధ్యత హీరో మీద పడినట్లు అర్థమవుతోంది. విజువల్ ఎఫెక్ట్స్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఈ సీన్స్ కు ప్రాణం పోశాయి. రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్ రెడ్డి నిర్మాణంలో యుగంధర్ ముని తెరకెక్కించిన ఈ చిత్రం డిసెంబర్ 25న క్రిస్మస్ కానుకగా వస్తోంది. ఇక అదిరిపోయే విజువల్స్, ఆది చెప్పిన పవర్ ఫుల్ డైలాగ్స్ తో 'శంబాల' మీద అంచనాలు డబుల్ అయ్యాయి. చూస్తుంటే ఆది ఈసారి బిగ్ హిట్ కొట్టేలా ఉన్నాడని అనిపిస్తుంది.

# ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్.. త్వరలో విడుదల!



పుష్ప సినిమాతో పాన్ ఇండియా హీరోగా మారిన అల్లు అర్జున్.. ఆ తర్వాత పుష్ప 2 సినిమాతో మరో ఫీట్ అందుకున్నారు. అత్యధిక కలెక్షన్స్ వసూలు చేసిన చిత్రాలలో రెండవ స్థానాన్ని దక్కించుకొని తెలుగు సినిమాకి ఊహించని స్థాయిని అందించారు అని చెప్పవచ్చు. అలాంటి ఈయన ఇప్పుడు ప్రముఖ కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో తన 22వ చిత్రాన్ని చేస్తున్నారు. ప్రముఖ నిర్మాత కళానిధి మారన్ సన్ పిక్చర్స్ బ్యానర్ పై భారీ బడ్జెట్ తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అటు అవతార్ తో పాటు హాలీవుడ్ చిత్రాలకు పనిచేసిన విఎఫ్ఎక్స్ కంపెనీల చేత ఈ చిత్రానికి విఎఫ్ఎక్స్ అందిస్తున్నారు. ఇందులో ప్రముఖ బాలీవుడ్ బ్యూటీ దీపిక పదుకొనే హీరోయిన్గా నటిస్తోంది. అలాగే మరో ముగ్గురు హీరోయిన్స్ కూడా ఇందులో భాగమవుతున్నట్లు గత కొన్ని రోజులుగా వార్తలు వినిపిస్తున్నాయి. అంతేకాదు పుష్ప, పుష్ప2 చిత్రాలలో శ్రీవల్లి క్యారెక్టర్ తో అందరినీ అబ్బురపరిచిన రష్మిక మందన్న ఈసారి అల్లు అర్జున్ తో పోటీ పడడానికి సిద్ధమవుతోందని, విలన్ క్యారెక్టర్ పోషిస్తోందనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి. కానీ దీనిపై స్పష్టత లేదు. ఇది ఇలా ఉండగా ఈ సినిమా 2027లో విడుదల అయ్యే అవకాశం ఉందని సినీ వర్గాలలో వార్తలు చక్కర్లు కొడుతున్న నేపథ్యంలో అభిమానులకు ఒక గుడ్ న్యూస్ వినిపిస్తోంది . అదేమిటంటే సినిమాను త్వరగా రిలీజ్ చేయాలని అట్లీ భావిస్తున్నట్లు సమాచారం. అసలు విషయంలోకి వెళ్తే.. అల్లు అర్జున్ అట్లీ కలయికలో వస్తున్న ఈ సినిమా ఒక భాగంగా వస్తుందా లేక రెండు భాగాలుగా వస్తుందా అనేది తెరపై సాగుతున్న చర్చ. అయితే ఈ సినిమాని రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని డైరెక్టర్ అట్లీ నిర్ణయించుకున్నారట. అందుకే తొలి భాగాన్ని వీలైనంత త్వరగా పూర్తిచేసి వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరి ఇందులో ఎంత నిజం ఉందో తెలియదు కానీ ఒకవేళ ఈ సినిమా రెండు భాగాలుగా రాబోతుందని అందులో భాగంగానే మొదటి భాగాన్ని త్వరగా రిలీజ్ చేయాలని మేకర్స్ నిజంగానే భావిస్తున్నట్లయితే గనుక అభిమానులకు ఇది అతిపెద్ద గుడ్ న్యూస్ అని చెప్పవచ్చు.

# బికినీ బీచ్‌లో ధనశ్రీ వైబ్స్ వైరల్



కిల్లర్ లుక్స్ తో కట్టి పడేయడంలో ధనశ్రీ వర్మ తర్వాతే. స్టన్నింగ్ ఫోజులతో కుర్రకారు గుండెల్లో గిలిగింతలు పెట్టడంలో ఈ భామ ట్రాక్ పెద్దదే. కొరియోగ్రాఫర్ కం నటి ధనశ్రీ ఫ్యాషన్ సెన్స్ పరంగాను నేటి జెన్ జెడ్ కిడ్స్ లో రఫ్ కాంపిటీటర్ గా దూసుకుపోతోంది. తాజాగా ఈ బ్యూటీ బీచ్ వెకేషన్ లో అదిరిపోయే ఫోజులతో కట్టి పడేసింది. ధనశ్రీ వంగపువ్వు రంగు లాంగ్ ఫ్రాక్ ధరించి అందంగా కనిపిస్తోంది. బీచ్ పరిసరాల్లో అందమైన రిసార్ట్ వాతావరణంలో ఎంతో స్ట్రైకింగ్ గా కనిపిస్తోంది ఈ బ్యూటీ. కనుచూపు మేరా నీలి రంగు సముద్రం ఎంతో మనోహరంగా కనిపిస్తుంటే, అక్కడ స్వేచ్ఛగా సేదదీరుతూ ధనశ్రీ ఇచ్చిన ఫోజులు హృదయాలను గెలుచుకుంటున్నాయి. ఈ భామ తన వీపందాన్ని ఎలివేట్ చేస్తూ, బ్యాక్ లెస్ ఫ్రాక్‌లో మతులు చెడగొడుతోంది. ఓవైపు సినిమాలు, మరోవైపు కొరియోగ్రఫీ అసైన్ మెంట్స్, టీవీ షోలతో బిజీ బిజీగా గడిపే ధనశ్రీ తన తీరిక సమయాన్ని ఇలా యూనిక్‌గా ప్లాన్ చేసింది. ధనశ్రీ ప్రస్తుతం టాలీవుడ్ లో డ్యాన్స్ బేస్డ్ చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమాని ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్మిస్తున్నారు. మరోవైపు తమిళం, హిందీలోను ధనశ్రీ నటిస్తోంది. 2025లో ఎక్కువగా మీడియా హెడ్ లైన్స్ లో నిలిచిన ఈ భామ క్రికెటర్ చాహల్ నుంచి విడిపోయిన సంగతి తెలిసిందే. కరోనా క్రైసిస్ సమయంలో పరిచయం అనంతరం ప్రేమలో పడిన ధనశ్రీ-చాహల్ జంట పెద్దల్ని ఒప్పించి పెళ్లి చేసుకున్నారు. కానీ ఈ బంధం ఎంతో కాలం నిలవలేదు.



# రెండు పడవల మీద ప్రయాణం.. వర్కౌట్ అవుతుందా?

హీరోలకైనా.. హీరోయిన్స్ కైనా ఒక భాషలో ఒక సినిమా చేస్తున్నప్పుడు వేరే భాషలో వేరే సినిమాలో కూడా అవకాశం రావడం సహజమే. అయితే ఆ రెండు చిత్రాలు కూడా అనుకున్న సమయానికి విడుదల కావాలి అంటే.. సైన్ చేసిన రెండు చిత్రాలకి కూడా బ్యాలెన్స్ గా కాల్ షీట్స్ ను అడ్జస్ట్ చేయాల్సి ఉంటుంది. అలా ఒకే సమయంలో రెండు చిత్రాల షూటింగ్లలో పాల్గొనడం అంటే.. ఏ నటీనటులకైనా సరే రెండు పడవల మీద ప్రయాణం లాంటిది అని చెప్పవచ్చు. అయితే ఆ రెండు సినిమాలు సక్సెస్ సాధించాయి అంటే మాత్రం ఆ నటీనటులకు క్రేజ్ మరింత పెరిగిపోతుంది. అయితే ఆ సక్సెస్ లభించాలి అంటే అందుకు తగ్గట్టుగానే సెలబ్రిటీలు కూడా కష్టపడాల్సిన అవసరం ఎంతైనా ఉంటుంది. ఈ క్రమంలోనే ప్రముఖ హీరోయిన్ గా పేరు సొంతం చేసుకున్న మృనాల్ ఠాకూర్ కూడా ఇప్పుడు రెండు పడవల మీద ప్రయాణం చేస్తోంది. మరి ఈ ప్రయాణం ఆమెకు వర్కౌట్ అవుతుందా లేదా అనే విషయానికొస్తే.. ఈ మధ్యకాలంలో కొత్తదనం నిండిన కథలతో అభిమానులను అలరిస్తున్న అతి తక్కువ మంది హీరోయిన్స్ లో ఒకరిగా పేరు తెచ్చుకున్న ఈమె.. సన్నాఫ్ సర్దార్ 2 చిత్రంతో ప్రేక్షకులను పలకరించింది. వచ్చే ఏడాది వరుస ప్రాజెక్టులతో తెరపై మెరవడానికి సిద్ధమవుతోంది. అందులో భాగంగానే తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె తెలుగు, హిందీ చిత్రాలలో ఏకకాలంలో నటించడంపై కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకుంది. ప్రస్తుతం తెలుగులో డెకాయిట్ అనే చిత్రంతోపాటు అటు హిందీలో ధో దీవానే సెహర్ మే వంటి చిత్రాలలో నటిస్తోంది. ఈ రెండు సినిమాలు కూడా వచ్చే ఏడాది విడుదల కాబోతున్నాయి. రెండు భాషలకు చెందిన ఈ సినిమాలను ఒకేసారి ఏకధాటిగా చిత్రీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే దీని గురించి మృణాల్ మాట్లాడుతూ.. "కొన్ని కొన్ని సార్లు నాలో మంచి ప్లానర్ ఉన్నారని అనిపిస్తుంది. ఎందుకంటే సినిమాల విషయంలో నాకు ముందుగానే ప్రణాళికలు వేసుకోవడం చాలా ఇష్టం. అటు నన్ను ఎంతగానో ఆరాధిస్తున్న తెలుగు అభిమానులను నిరాశపరచడం నాకు ఇష్టం లేదు. అలాగే బాలీవుడ్ కూడా నాకు కంఫర్ట్ జోన్. కానీ నటిగా సరిహద్దులను దాటి నటించడమే నాకు ఇష్టం. పైగా ఇది సవాలుతో కూడుకున్న విషయం. కానీ ఇలాగే ఉండాలని నేను కలలు కన్నాను. చివరికి ఇప్పుడు సాధ్యమవుతోంది. ఇక ఈ రెండు చిత్రాలను ఏకకాలంలో చిత్రీకరించడంలో సహాయం చేసిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు" అంటూ మృనాల్ చెప్పుకొచ్చింది. ఏది ఏమైనా ఇటు తెలుగు అటు హిందీ రెండు చిత్రాలలో ఏకధాటిగా షూటింగ్లలో పాల్గొంటూ రెండు పడవల మీద ప్రయాణం చేస్తోంది ఈ ముద్దుగుమ్మ. మరి ఈ ప్రయాణం ఈమెకు కలిసి రావాలి అంటే వచ్చే ఏడాది ఈ సినిమాలు రిలీజ్ అయ్యే వరకు ఎదురు చూడాల్సిందే. ఒకవేళ ఈ రెండు సినిమాలు కూడా మంచి సక్సెస్ అందుకున్నాయి అంటే మృణాల్ కి ఇక ఇండస్ట్రీలో తిరుగులేదు అని చెప్పవచ్చు.

# గ్రామ పాలనను నిలబెట్టండి!

**కొత్త సర్పంచ్‌లకు శుభాకాంక్షలు కాదు..**
**ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయాలు ఇవే**
**గ్రామ పాలనపై ప్రభుత్వానికి సూచనలు**
**ఎస్.వి. రమణా చారి, సీనియర్ జర్నలిస్ట్**






రాష్ట్రవ్యాప్తంగా 12,700కు పైగా గ్రామ పంచాయతీలు. 1.4 కోట్లకు పైగా గ్రామీణ జనాభా. రాష్ట్ర అభివృద్ధికి పునాది గ్రామ పాలనే. ఈ నేపథ్యంలో నేడు కొత్తగా ఎన్నికైన గ్రామ సర్పంచ్‌లు పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ వారికి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. కానీ నిజం ఏమిటంటే.. శుభాకాంక్షలతో గ్రామాలు మారవు. నిర్ణయాలతోనే మారతాయి. ఈ రోజు పదవీ స్వీకారం చేస్తున్న సర్పంచ్‌ల ముందు ఉన్నది పండుగ కాదు. పాలన పరీక్ష. ఆ పరీక్షను ఎదుర్కొనే బాధ్యత సర్పంచ్‌లదే కాదు.. ప్రభుత్వానిదే.

**ఖాళీ ఖజానాలతో పాలన సాధ్యమా? - ప్రభుత్వ నిర్ణయం కావాలి**

గ్రామ పంచాయతీలు నేడు నిధుల కేంద్రాలు కాదు.. బాకీల గోదాములుగా మారాయి. పెండింగ్ బిల్లులు, స్వచ్ఛభారత్–పారిశుద్ధ్య బకాయిలు, ఉపాధి హామీ అప్పులు ఇవి కొత్త సర్పంచ్‌లకు వారసత్వంగా వచ్చాయి.

**ప్రభుత్వానికి సూచన:**

అన్ని గ్రామ పంచాయతీల పాత బకాయిలను ఒకేసారి క్లియర్ చేయాలి గ్రామ పంచాయతీలకు స్థిర నిధుల విధానం (Assured Grants) అమలు చేయాలి

“నిధులు విడుదల చేస్తున్నాం” అన్న మాటకు గ్రౌండ్ లెవల్ ఫలితం కనిపించాలి

**అధికారాలు లేని బాధ్యతలు -ఈ విరుద్ధతకు ముగింపు పలకాలి**

చట్టం ప్రకారం సర్పంచ్ గ్రామాధిపతి. వాస్తవంలో మాత్రం ప్రతి నిర్ణయం అధికార యంత్రాంగం చేతుల్లో ఉంది. ప్రతి చిన్న పనికీ అనుమతులు, మండల–జిల్లా కార్యాలయాల చుట్టూ తిరుగుడు, పనులు జరగకపోతే నిందలు మాత్రం సర్పంచ్‌పైనే.

**ప్రభుత్వానికి సూచన:**

సర్పంచ్‌కు నిర్ణయాధికారాలు స్పష్టంగా నిర్వచించాలి, గ్రామ కార్యదర్శి, మండల అధికారుల పాత్రకు చట్టబద్ధమైన హద్దులు పెట్టాలి. చిన్న అభివృద్ధి పనులకు లోకల్ లెవల్ అప్రూవల్స్ ఇవ్వాలి

**పారిశుద్ధ్యం, తాగునీరు - ప్రకటనలకే పరిమితమా?**

“స్వచ్ఛ గ్రామం”, “ఇంటింటికీ నల్లా నీరు” ఈ నినాదాలు గ్రామాల్లో ఇప్పటికీ ప్రశ్నలుగానే వినిపిస్తున్నాయి. గల్లీల్లో చెత్త, నిండిపోయిన డ్రైనేజీలు, వేసవిలో తాగునీటి కటకట.

**ప్రభుత్వానికి సూచన:**

పారిశుద్ధ్యానికి ప్రత్యేక బడ్జెట్.. శాశ్వత సిబ్బంది ఏర్పాటు చేయాలి

మిషన్ భగీరథ సరఫరాపై గ్రామ స్థాయి మానిటరింగ్ వ్యవస్థ ఉండాలి

నీటి సమస్య ఉన్న గ్రామాలను హై–రిస్క్ జోన్లుగా ప్రకటించాలి

**ఉపాధి హామీ - ఆరోపణల గూటి కాకూడదు**

ఉపాధి హామీ పథకం గ్రామీణ జీవనానికి ఆధారం.

కానీ అదే పథకం చుట్టూ ఫేక్ పనులు, మస్టర్ రోల్స్, రాజకీయ జోక్యాల ఆరోపణలు.

**ప్రభుత్వానికి సూచన:**

ఉపాధి పనుల వివరాలు గ్రామ సభల్లో తప్పనిసరిగా బహిరంగం చేయాలి.

సర్పంచ్‌పై కాకుండా వ్యవస్థపై బాధ్యత పెట్టాలి.

నిజాయితీగా పనిచేసే సర్పంచ్‌లకు చట్టపరమైన రక్షణ ఇవ్వాలి

**మహిళా, యువ సర్పంచ్‌లు - పేరుకేనా? పాలనకా?**

మహిళా సర్పంచ్‌ల విషయంలో “భర్తే సర్పంచ్” అన్న విమర్శ ఇంకా కొనసాగుతోంది.

యువ సర్పంచ్‌లు మాత్రం అనుభవం లేదన్న ముద్రతో పక్కకు నెట్టబడుతున్నారు.

**ప్రభుత్వానికి సూచన:**

మహిళా సర్పంచ్‌లకు స్వతంత్ర పాలనా హక్కు అమలులో ఉందో లేదో పర్యవేక్షించాలి.

బెనామీ పాలనపై కఠిన చర్యలు తీసుకోవాలి.

యువ సర్పంచ్‌లకు ప్రత్యేక శిక్షణ, మెంటారింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి.

**పర్యవేక్షణ మాటల్లో కాదు - పనిలో కనిపించాలి**

గ్రామ పంచాయతీలు ప్రభుత్వానికి పునాది.

కానీ పర్యవేక్షణ మాత్రం కాగితాలకే పరిమితం.

**ప్రభుత్వానికి సూచన:**

ప్రతి మండలంలో గ్రామ పాలన సపోర్ట్ సెల్ ఏర్పాటు చేయాలి. సర్పంచ్‌ల సమస్యలకు టైమ్‌బౌండ్ పరిష్కార వ్యవస్థ ఉండాలి.

వార్షికంగా గ్రామ పాలనపై పబ్లిక్ ఆడిట్ నిర్వహించాలి.

**తుదిసూచన - ఇది ప్రభుత్వానికి పరీక్ష**

గ్రామాభివృద్ధి కోసం కేవలం కొత్త సర్పంచ్‌లు కాదు..

కొత్త పాలనా నిర్ణయాలు అవసరం.

అధికారాలు, నిధులు, రక్షణ లేకుండా

సర్పంచ్‌లను బాధ్యులను చేయడం

ప్రజాస్వామ్యానికి న్యాయం కాదు.

ఈ రోజు పరీక్షలో ఉన్నది సర్పంచ్‌లు కాదు..

ప్రభుత్వ వ్యవస్థ. ఈ పరీక్షలో ప్రభుత్వం ఉత్తీర్ణత సాధిస్తేనే


గ్రామాలు ముందుకు వెళ్తాయి. లేకపోతే కొత్త సర్పంచ్‌లు వస్తూనే ఉంటారు.

గ్రామ సమస్యలు మాత్రం అలాగే ఉంటాయి.


**- ఎడిటోరియల్**

# ఉపాధి హామీ పథకానికి గాంధీ పేరు కొనసాగించాలి

**కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నిరసన**




కరీంనగర్, జనతా న్యూస్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరులో నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు కరీంనగర్ నగరంలోని కారానా గడ్డ గాంధీ చౌక్ వద్ద జిల్లా కాంగ్రెస్, కార్పొరేషన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూజాతీయ ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరు కొనసాగించాలని, నూతనంగా ఎన్నికైన సర్పంచులు ఈ మేరకు తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేశారు. పథకానికి పేరు మార్చడం ద్వారా గాంధీని ప్రజల మనసుల నుంచి తొలగించలేరని స్పష్టం చేశారు. నిరసనలో పాల్గొన్న మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంతరావు మాట్లాడుతూ దేశ స్వాతంత్రానికి నాయకత్వం వహించిన మహాత్మా గాంధీ చరిత్రను మరుగున పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. గాంధీ పేరుతో కొనసాగుతున్న ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, వ్యవసాయ అభివృద్ధి సాధ్యమైందని గుర్తుచేశారు. ఈ చట్టంలో మార్పులు చేస్తే రాష్ట్రాలపై ఆర్థిక భారం పెరుగుతుందని హెచ్చరించారు. డిసిసి అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలనే డిమాండ్‌తో గ్రామస్థాయిలో ఉద్యమం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఏ మార్పులు చేసినా సహించబోమని స్పష్టం చేశారు. మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఉపాధి హామీ కూలీలు ఈ పథకంపై ఆధారపడి జీవిస్తున్నారని, గాంధీ పేరు తొలగించడం పేదల మనోభావాలను దెబ్బతీయడమేనని అన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ తదితరులు మాట్లాడుతూ ప్రయోజనకరమైన పథకాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పథకం విశిష్టతను ప్రతి గ్రామంలో ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో పీసీసీ నాయకులు, జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, నూతనంగా ఎన్నికైన సర్పంచులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# తండాల అభివృద్ధికి కలిసికట్టుగా సాగాలి




హుస్నాబాద్, జనత న్యూస్: ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, ఓడిన అభ్యర్థులు నిరాశ చెందకుండా నిరంతరం ప్రజల పక్షాన ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు రాజు నాయక్ పిలుపునిచ్చారు. అక్కన్నపేట మండలంలోని పలు గిరిజన తండాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులతో పాటు.. పోటీలో నిలిచిన అభ్యర్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ.. గెలిచిన ప్రజా ప్రతినిధులు తండాల అభివృద్ధికి అంకితభావంతో పని చేయాలని ఆకాంక్షించారు. ప్రజాస్వామ్యంలో పోటీ ఆరోగ్యకరమని, ఓటమిని సవాలుగా తీసుకుని ప్రజాసేవలో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్య కృష్ణా నాయక్, ఉప సర్పంచ్ భూక్య తిరుపతి నాయక్, వార్డు సభ్యులు మాలోతు సత్యం నాయక్, సర్పంచ్ అభ్యర్థి భూక్య వీరన్న నాయక్‌లతో పాటు ఐలేని మల్లికార్జున్‌రెడ్డి, మోహన్ రెడ్డి, మాలోత్ రాంచందర్ నాయక్, భూక్య మోతీలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి రద్దు

కరీంనగర్, జనతా న్యూస్: కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో రేపు(సోమవారం) ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. రెండో సాధారణ పంచాయతీ ఎన్నికలు– 2025 లో గెలుపొందిన సర్పంచ్, వార్డు సభ్యులు ఈ నెల 22వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నందున అధికార యంత్రాంగం ఆయా పనులలో నిమగ్నమై ఉంటారని పేర్కొన్నారు. ఈ కారణంగా ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని తెలిపారు. ఈ నెల 29వ తేదీ నుండి యధాతధంగా ప్రజావాణి నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ వెల్లడించారు. ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కలెక్టర్ కోరారు.

# ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా 'ఆదివారాలు-సైకిల్‌తో' నిర్వహణ





కరీంనగర్, డిసెంబరు 21: రాష్ట్ర క్రీడల సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ అనుమతితో జిల్లా క్రీడల సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా 'ఆదివారాలు–సైకిల్‌తో' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, యువ భారత్ సమన్వయకర్త రాంబాబు, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రమేష్ రెడ్డి, జిల్లా సైక్లింగ్ సంఘం కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి, అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన జీవనశైలికి నిత్య వ్యాయామం అవసరమని, అందులో సైక్లింగ్ అత్యంత ఉపయోగకరమని తెలిపారు. ప్రజలు వారానికి కనీసం ఒక రోజు అయినా సైక్లింగ్‌ను అలవాటు చేసుకోవాలని సూచించారు. సమాజంలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సైక్లింగ్ సంఘం సభ్యులు, సైక్లిస్టులు, నడక సంఘం సభ్యులు, ప్రాంతీయ క్రీడా పాఠశాల శిక్షకులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ప్రజల నుంచి మంచి స్పందన పొందిందని జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

# ధ్యానంతో మానసిక ప్రశాంతత

**యువ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాల రమేశ్**




కరీంనగర్, జనతా న్యూస్: ప్రతినిత్యం ధ్యాన సాధన మానసిక ప్రశాంతతను చేకూర్చుతుందని తద్వారా శారీరక మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని యువ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాల రమేశ్ అన్నారు . ఆదివారం అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకొని పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ధ్యాన దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానం ద్వారా ఆధ్యాత్మిక జీవితం సాగిస్తే మానవుడు మాధవుడుగా మారే ఒక అద్భుత మైన ప్రక్రియ అని పేర్కొన్నారు. నేటి ఒత్తిడి జీవితాన్ని ఎదుర్కోవడానికి ధ్యాన యోగ అత్యావశ్యకం అన్నారు. ఈ కార్యక్రమంలో పతంజలి యోగ సమితి సుమంగళి గార్డెన్స్ ప్రశికులు బి. లక్ష్మీ నారాయణ , కెఇఎస్ గార్డెన్స్ ప్రశిక్షకులు శేఖర్, యువ భారత్ బాధ్యులు గడ్డం మధు, ఏలేటి శ్రీనివాస్ , సత్తయ్య, శంకర్ లతో పాటు అధిక సంఖ్యలో యోగ సాధకులు పాల్గొన్నారు



# ఆలుగడ్డలతో ఎన్నో లాభాలు..

## కానీ వాటిని ఎలా పడితే అలా తినకూడదు..

మనం ఆహారంగా తీసుకునే దుంప జాతి కూరగాయలల్లో ఆలుగడ్డలు కూడా ఒకటి. ఇవి మనకు చాలా తక్కువ ధరలో విరివిగా లభిస్తూ ఉంటాయి. వీటితో మనం కూర, పులుసు, వేపుడు వంటి వాటిని చేసి తీసుకుంటూ ఉంటాం. ఆలుగడ్డలతో చేసే చిప్స్ చాలా రుచిగా ఉంటాయి. పిల్లలు ఈ చిప్స్ ను ఎంతో ఇష్టంగా తింటూ ఉంటారు. అయితే ఆలుగడ్డల్లో కార్బొహైడ్రేట్స్ ఎక్కువగా ఉంటాయని వీటిని వేయించి తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి హాని కలుగుతుందని వీటికి చాలా మంది దూరంగా ఉంటారు. కానీ ఆలుగడ్డల్లో కార్బొహైడ్రేట్స్ తో పాటు మన శరీరానికి కావల్సిన ఎన్నో పోషకాలు ఉంటాయని వీటిని తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఆలుగడ్డలను వేయించడానికి బదులుగా ఉడికించి లేదా బేక్ చేసి తీసుకున్నప్పుడు మాత్రమే ఈ ప్రయోజనాలను పొందగలమని అంటున్నారు.

**గుండె ఆరోగ్యానికి..**

ఆలుగడ్డల్లో విటమిన్ సి, పొటాషియం, విటమిన్ బి6, మెగ్నిషియం, పొటాషియం, ఐరన్, ఫోలేట్ వంటి పోషకాలు ఎన్నో ఉంటాయి. ఆలుగడ్డలను తీసుకోవడం వల్ల కండరాలు, నరాల పనితీరు పెరుగుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఆలుగడ్డల్లో కార్బొహైడ్రేట్స్ ఎక్కువగా ఉంటాయన్న సంగతి మనకు తెలిసిందే. అయితే ఆలుగడ్డల్లో ఉండే కార్బొహైడ్రేట్స్ రక్తంలో చక్కెర స్థాయిలను వేగంగా పెంచడానికి బదులుగా ఇవి శరీరానికి శక్తిని అందిస్తాయని నిపుణులు పరిశోధనల ద్వారా వెల్లడించారు. ఆటలు ఎక్కువగా ఆడేవారు తక్షణ శక్తి కోసం ఉడికించిన ఆలుగడ్డలను తీసుకోవడం వల్ల శరీరానికి తక్షణ శక్తి లభిస్తుందని చెబుతున్నారు.

**యాంటీ ఆక్సిడెంట్లు అధికం..**

ఆలుగడ్డలను తీసుకోవడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. వీటిలో పొటాషియంతో పాటు యాంటీ ఆక్సిడెంట్లు కూడా అధికంగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల రక్తప్రసరణ పెరగడంతో పాటు రక్తనాళాలు కుచించుకుపోవడం కూడా తగ్గుతుంది. జీర్ణక్రియను మెరుగుపరచడంలో ఆలుగడ్డలు మనకు ఎంతో సహాయపడతాయి. వీటిని తీసుకోవడం వల్ల పేగుల్లో మంచి బ్యాక్టీరియా శాతం పెరుగుతుంది. దీంతో జీర్ణ సంబంధిత ఇన్ఫెక్షన్ లు, అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది. ఎరుపు, పసుపు, ఊదా రంగు వంటి ఆలుగడ్డల్లో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఊదారంగు ఆలుగడ్డల్లో బెర్రీలకు సమానమైన యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయని తెలియజేస్తున్నారు. శరీరంలోని ఫ్రీ రాడికల్స్ ను నశింపజేసి మనం దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల బారిన పడకుండా మనల్ని కాపాడడంలో ఆలుగడ్డలు మనకు ఎంతో సహాయపడతాయి.

**బరువు తగ్గాలనుకుంటే..**

బరువు తగ్గాలనుకునే వారు ఆలుగడ్డలను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. వీటిని ఉడికించి తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సమయం ఆకలి వేయకుండా ఉండడంతో పాటు శరీరానికి కావల్సిన శక్తి కూడా లభిస్తుంది. దీంతో మనం సులభంగా బరువు తగ్గవచ్చు. వ్యాయామం చేసిన తరువాత కండరాలు వాటి గ్లైకోజన్ స్థాయిలను తిరిగి నిలుపుకోవడం చాలా అవసరం. ఆలుగడ్డలను తీసుకోవడం వల్ల కండరాలు వాటి గ్లైకోజన్ స్థాయిలను తిరిగి పొందడంతో పాటు చెమట ద్వారా శరీరం కోల్పోయిన మినరల్స్ కూడా తిరిగి అందుతాయి. ఈ విధంగా ఆలుగడ్డలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే వీటిని ఉడికించి తీసుకున్నప్పుడు మాత్రమే మనం ఆ ప్రయోజనాలను పొందగలుగుతాము. వీటిని నూనెలో వేయించి ఉప్పు, కారం వేసి చిప్స్ రూపంలో తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి బదులుగా అనారోగ్యానికి గురి కావాల్సి వస్తుంది.

# కాబోయే డాక్టర్లు ప్రజాసేవకే అంకితమవ్వాలి

**ఫార్మా కంపెనీలు, డయాగ్నస్టిక్ సెంటర్ల వలలో పడొద్దు**

**గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలకు ముందుకు రావాలి**

**ప్రతిమ మెడికల్ కాలేజీ వార్షికోత్సవంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు**




కరీంనగర్, జనతా న్యూస్: అమ్మ జన్మనిస్తే పునర్జన్మ ఇచ్చేది డాక్టరేనని, అందుకే డాక్టర్లను దైవంగా కొలుస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. అంతటి పవిత్రమైన వైద్య వృత్తిలోకి అడుగుపెడుతున్న కాబోయే డాక్టర్లు భవిష్యత్తులో ఫార్మా కంపెనీలు, డయాగ్నస్టిక్ సెంటర్ల ఆఫర్లకు లోనై ప్రజలకు అన్యాయం చేయొద్దని ఆయన సూచించారు. కరీంనగర్‌లోని ప్రతిమ మెడికల్ కాలేజీ 24వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైద్య విజ్ఞానంలో ఎప్పటికప్పుడు మార్పులు జరుగుతున్నాయని, వాటికి అనుగుణంగా డాక్టర్లు అప్‌డేట్ కాకపోతే రోగులకు ప్రమాదకర పరిస్థితులు తలెత్తుతాయని హెచ్చరించారు. డాక్టర్ వృత్తిని వ్యాపారంగా కాకుండా ప్రజాసేవగా భావించాలని కోరారు. ఎంబీబీఎస్ చదువు టీ-20 మ్యాచ్ కాదని, ఐదేళ్ల టెస్ట్ మ్యాచ్‌లాంటిదని సంజయ్ వ్యాఖ్యానించారు. నిద్రలేని రాత్రులు, తీవ్రమైన మానసిక ఒత్తిళ్ల మధ్య చదువు సాగుతుందని, కానీ చివరకు రోగి ప్రాణం కాపాడినప్పుడు దక్కే సంతృప్తి అమూల్యమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు తీవ్రంగా కొరవడుతున్నాయని, డాక్టర్లు ఎక్కువగా పట్టణాలకే పరిమితమవుతున్నారని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపడితే అక్కడ కూడా డాక్టర్లు సేవలందించేందుకు ముందుకు వస్తారని అభిప్రాయపడ్డారు. అలాగే ఎంబీబీఎస్ అనంతరం పీజీ సీట్లు తక్కువగా ఉండటం, ప్రైవేట్ సూపర్ స్పెషాలిటీ కోర్సుల ఫీజులు అధికంగా ఉండటం వల్ల ఎంతోమంది ఉన్నత చదువుకు దూరమవుతున్నారని చెప్పారు. ఈ అంశంపై ప్రభుత్వాలు సమగ్ర విధాన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు నిబద్ధతతో సేవలందిస్తే ఏ రంగంలోనైనా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని, కాబోయే డాక్టర్లు కూడా అదే మార్గాన్ని అనుసరించాలని ఆయన ఆకాంక్షించారు.






# రామడుగు మండలంలో హత్య కేసు ఛేదన

## రూ.3 లక్షల సుపారీతో యువకుడి హత్య.. ఐదుగురు అరెస్ట్




కరీంనగర్, జనతా న్యూస్: రామడుగు మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గాదె అంజయ్య (36) అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. అంజయ్యను హత్య చేయడానికి రూ.3 లక్షలకు సుపారీ ఇచ్చినట్లు దర్యాప్తులో తేలిన నేపథ్యంలో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం

లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గాదె లచ్చయ్య (63) అంజయ్యను తొలగించేందుకు పథకం వేశాడు. నేరుగా హత్య చేస్తే అనుమానం వస్తుందని భావించి, అదే గ్రామానికి చెందిన కొలిపాక రవి (55) సహాయంతో సుపారీ గ్యాంగ్‌ను సంప్రదించాడు. రవి తన బంధువైన ఉప్పరపల్లి కోటేశ్వర్ (31), అతని స్నేహితుడు మహమ్మద్ అబ్రార్ (23)లతో అంజయ్యను హత్య చేయించేందుకు రూ.3 లక్షలకు ఒప్పందం కుదిర్చాడు. ఈ నెల 2న మద్యం తాగుదామని అంజయ్యను గ్రామ శివారులోని కెనాల్ సమీపానికి పిలిచారు. అక్కడ అతనికి అమితంగా మద్యం తాగించి మత్తులోకి వెళ్లిన తర్వాత కోటేశ్వర్ గొంతు నులమగా, అబ్రార్ చేతులు పట్టుకుని అంజయ్యను హతమార్చారు. అనంతరం సాక్ష్యాలను మరుగుపరచేందుకు మృతదేహాన్ని డీ-8 కెనాల్‌లోకి తోసేశారు. డిసెంబరు 5న కెనాల్‌లో మృతదేహం లభ్యమైంది. ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు చూపించేందుకు నిందితులు ప్రయత్నించినప్పటికీ, పోలీసుల లోతైన దర్యాప్తులో హత్యకు సంబంధించిన వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి నేరానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్లు, బైక్‌తో పాటు రూ.40 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# కాంగ్రెస్ లో చేరిన పలువురు సర్పంచులు

మానకొండూర్, జనతా న్యూస్ : త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ లో తిమ్మాపూర్ మండలం జూగుండ్ల సర్పంచ్ పురం శ్వేత, ఉప సర్పంచ్ దాడి సంపత్, గన్నేరువరం మండలం హన్మాజీపల్లి సర్పంచ్ నందికొండ అంజిరెడ్డి, మానకొండూర్ మండలం వెల్ది గ్రామ సర్పంచ్ పెంచాల కిషన్ రావు, మానకొండూర్ మాజీ సర్పంచ్ రొడ్డ పృధ్వీ,బీఆర్ఎస్ వెల్ది గ్రామశాఖ ప్రధాన కార్యదర్శి మడ్డి చంద్రయ్య తదితరులకు ఆయన కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పారు.

ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అందిస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి అనేక మంది సర్పంచులు, వార్డు సభ్యులు, ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారన్నారు. కాంగ్రెస్ లో చేరిన వారంతా ప్రభుత్వ పథకాలను పేదలకు చేరువయ్యేలా చూడాలని, అలాగే కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ముఖ్యంగా త్వరలో జరుగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మానకొండూర్,గన్నేరువరం మండలాల పార్టీ అధ్యక్షులు నందగిరి రవీంద్రచారి, ముస్కు ఉపేందర్ రెడ్డి, పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి,శ్రీగిరి రంగారావు, మామిడి అనిల్ కుమార్, కె.ఎల్లారెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి, బుర్ర తిరుపతిగౌడ్, కరుణాకర్ రెడ్డి, రాజయ్య, ద్యావ శ్రీనివాస్ రెడ్డి,మడుపు ప్రేమ్ కుమార్, తాళ్లపల్లి నరేష్, ఎండీ ఇర్ఫాన్,కొత్తకొండ శంకర్, కోంద్ర సురేష్, ఎర్రోళ్ల కవిత, మహమూద్, బషీర్, శ్రీకాంత్, ఆసిఫ్, రాకేష్, సుమన్, వినోద్, అశోక్, బక్కారెడ్డి, రుద్రవరం సాయి కుమార్, ముష్కం రాజు కుమార్ మాంకాలి కృష్ణవేణి, జేరిపోతుల సతీష్, రుద్రవరం స్వరూప, ఎడ్ల కనుకా రెడ్డి చల్లూరి విశ్వనాథం, నలువాల రవీందర్ రావు, పోచంపల్లి శ్రీనివాస్, నలువాల ప్రభాకర్ రావు, నలువాల గోపాల్ రావు, శ్రీనివాస్, పోలు శ్రీనివాస్, ఎనగంటి భావనారుషి, కోల వీరేశం, మాజీ ఉప సర్పంచ్ నలువాల రవీందర్ రావు, నలువాల కనుకయ్య, ఎనగంటి శ్రీకాంత్,




మునిగాల లక్ష్మిరాజం, చింతల సత్యనారాయణ, తాళ్లపల్లి సంపత్, తాళ్లపల్లి శ్రీనివాస్, తొడుపునూరి వీరేశం, కోల వీరేశం, గంప చంద్రమౌళి, మడ్డి పర్శరాములు, మడ్డి చంద్రయ్య, మడికంటి విక్రమ్, శ్రీనివాస్, గూటం అనిల్ రెడ్డి, అనపురం శ్రీనివాస్,ఆరెపల్లి రవి, శివ, పర్లపల్లి కనుకయ్య, అంతగిరి ఫణీంద్ర, రామగిరి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com